# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

prajakshetram.in

అతి కొద్ది కాలంలోనే ఆదరణ పొందిన 'ప్రజాక్షేత్రం'
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని మండలాల వారిగా
నియోజకవర్గాల వారిగా, జిల్లాల వారిగా

రిపోర్టర్లు కావలెను

అనుభవం గలవారికి ప్రాధాన్యం ఇవ్వబడును

ప్రజాక్షేత్రం

కాల్ : 9177920459

సంపుటి - 01 | సంచిక - 202 | హైదరాబాద్ | మంగళవారం | 05- 11 -2024 | పేజీలు - 6 | వెల.4/-

# జార్ఖండ్‌లో హోరెత్తిన ప్రచారం

- ఆదివాసీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం
- లాక్కున్న భూములను తిరిగి ఇచ్చే బాధ్యత మాదే
- పదేళ్లలో 25కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశాం
- జార్ఖండ్‌ను వ్యతిరేకించిన ఆర్జెడితో జెఎంఎం పొత్తు
- ఇక రాష్ట్రంలో అధికారం తమదే అన్న మోడీ
- ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని



**రాంచీ,నవంబర్4(ప్రజాక్షేత్రం:**

ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రచారం హోరెత్తుతోంది. అధికార, విపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. తాజాగా ప్రధాని నరేంద్ర మోదీ చాయిబసలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొని విపక్షాలపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. ఝార్ఖండ్‌లో కాంగ్రెస్, ఆర్జేడీ ఆదివాసీలపై అనాగరిక నేరాలకు పాల్పడ్డాయని ధ్వజమెత్తారు. ఆనాడు ఝార్ఖండ్ ఏర్పాటును ఆర్జేడీ వ్యతిరేకించిందన్న ప్రధాని.. ఇప్పుడు జేఎంఎం దాని ఒళ్లో కూర్చొందంటూ చురకలంటించారు. ఈ సారి రాష్ట్రంలో అత్యధిక సీట్లు గెలుచుకొని చరిత్ర లిఖిస్తామని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు.ఝార్ఖండ్‌లో భాజపా ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే చొరబాటుదారులను అడ్డుకొనేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. అక్రమంగా లాక్కున్న భూమిని తిరిగి ఆదివాసీ మహిళల పేర్లపై బదలాయించేలా చట్టాన్ని తీసుకొస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్లు రద్దు చేసి ఓటు బ్యాంకుకు అప్పగించేందుకు చూస్తోందని, ఓటు బ్యాంకు కోసం ఝార్ఖండ్ జనాభా మార్చే విషయంలో జేఎంఎం-కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నాయని ప్రధాని ఆరోపించారు. పేదల కష్టాలను దగ్గర నుంచి చూశానన్న మోదీ.. అందుకే పదేళ్లలో పేదల కోసం పథకాలు అమలు చేస్తున్నామ న్నారు. ఈ పథకాల ఫలితంగానే పదేళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు మాత్రం చాలా కాలంగా ఆదివాసీ సమాజాన్ని పేదరికంలోనే ఉంచాయని ఆక్షేపించారు. ఝార్ఖండ్‌లో పేదరిక మిగతా 2లో..

## ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



## కెనడాలో పరిస్థితులపై కేంద్రం ఆందోళన

- హిందూ దేవాలయంపై దాడి దారుణం
- తీవ్రంగా ఖండించిన విదేశాంగ శాఖ



## 8న యాదాద్రిలో సిఎం రేవంత్ పూజలు

- అదేరోజు మూసీ పరివాహకంలో పాదయాత్ర

**హైదరాబాద్,నవంబర్4(ప్రజాక్షేత్రం:**

ఈ నెల 8న తన పుట్టినరోజు సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి యాదాద్రి క్షేత్రంలో పూజలు చేయనున్నారు. అదే రోజు మూసీ పరివాహక ప్రాంతాల్లో పాదయాత్ర చేసే అవకాశం ఉంది. భువనగిరి నుంచి వలిగొండ వైపు



పాదయాత్ర చేయనున్నారని సమాచారం. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల 2లో..

## నేడే అమెరికా అధ్యక్ష ఎన్నికలు

- ట్రంప్, కమలా హారిస్ మధ్య పోటాపోటీ
- గెలుపోటములపై స్వల్ప తేడా అంటున్న విశ్లేషకులు
- న్యూయార్క్ రాష్ట్రంలో బెంగాలీలోనూ బ్యాలెట్

**న్యూయార్క్,నవంబర్4(ప్రజాక్షేత్రం:**

ఇప్పుడు అందరి దృష్టి అమెరికా అధ్యక్ష ఎన్నికలపైనే ఉంది. నవంబర్ 5న అంటే మంగళవారమే ఓటింగ్ జరుగగనుంది. అధ్యక్ష ఎన్నికలు తుది దశకు చేరుకో



గానే ఇప్పుడు అందరి దృష్టి స్వింగ్ స్టేట్స్ పైనే ఉన్నాయి. అమెరికా ఎన్నికల ఫలితాలను మూడు రకాల రాష్ట్రాలు నిర్ణయిస్తాయి. వీటిని రెడ్, మిగతా 2లో..

## యాప్ ద్వారా ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక

- అర్హులైన పేదలందరికీ ఇళ్ల నిర్మాణం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

**ఖమ్మం,నవంబర్4(ప్రజాక్షేత్రం:**


ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.



పార్టీలకు, కులాలకు అతీతంగా గ్రామ సభలు పెట్టి అర్హులైన పేదలకు ఇళ్లు నిర్మించే కార్యక్రమం చేపట్టామని అన్నారు.మరో రెండు రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ మిగతా 2లో...

## ఈసీ కీలక నిర్ణయం

-14 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల తేదీల్లో మార్పు



**న్యూఢిల్లీ, నవంబర్ 4 ప్రజాక్షేత్రం:**

ఎన్నికల సంఘం కీలక నిర్ణయం ప్రకటించింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల పై కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 13వ తేదీన పలు అసెంబ్లీ స్థానాలకు జరగాల్సిన ఉప ఎన్నికల తేదీల్లో కీలక మార్పు చేసింది. మొత్తం మూడు రాష్ట్రాల్లోని పలు అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికలను వారం రోజులపాటూ వాయిదా వేసింది. కేరళ , పంజాబ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో 14 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 13న ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఈసీ గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ఆరోజున పలు మతపరమైన మిగతా 2లో...

## బాణాసంచా నిషేధాన్ని ఎందుకు అమలు చేయలేదు

- ఢిల్లీ సర్కారుపై సుప్రీంకోర్టు ఆగ్రహం



**న్యూఢిల్లీ, నవంబర్ 4 ప్రజాక్షేత్రం:**

ఢిల్లీలో వాయు కాలుష్యం పెరగడంపై ఢిల్లీ సర్కారుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పత్రికల్లో వస్తున్న వార్తలను చూస్తే.. ఢిల్లీలో బాణాసంచా నిషేధం అమలు కాలేదని అనిపిస్తోందని పేర్కొంది. ఇందుకు సంబంధించి సమాధానం చెప్పాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. బాణాసంచా నిషేధంపై ఢిల్లీ ప్రభుత్వం కీలక చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. దీపావళి నుంచి ఢిల్లీ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగింది. దాంతో జనం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శ్వాస కోశ సమస్యలు, కళ్లు ఎర్రబారడం, చికాకు తదితర సమస్యలతో బాధ పడుతున్నారు. ప్రస్తుతం నగరంలోని చాలా మిగతా 2లో..

## పెండింగ్ బిల్లుల కోసం చలో హైదరాబాద్

- ఎక్కడిక్కడే మాజీ సర్పంచ్‌ల అరెస్ట్
- మద్దతుగా బిఆర్ఎస్ నేతల ఆందోళన
- హరీష్ రావు తదితరుల అరెస్ట్
- అరెస్ట్‌లను ఖండించిన కెటిఆర్ తదితరులు



**హైదరాబాద్,నవంబర్4(ప్రజాక్షేత్రం:**

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలంటూ తెలంగాణలో మాజీ సర్పంచులు పోరుబాట పట్టారు. సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చేందుకు హైదరాబాద్ చేరుకుని ఓ హోటల్‌లో సమావేశమయ్యారు. అనంతరం మిగతా 2లో..

## ఆరులక్షల కోట్లు ఆవిరి

- అమెరికా ఎన్నికలు...ఫెడ్ వడ్డీరేట్లు
- దేశీయ మార్కెట్లో భారీ కుదుపు



**ముంబయి,నవంబర్4(ప్రజాక్షేత్రం:**

దేశీయ మార్కెట్లు మరోమారు బేర్‌మన్నాయి. భారీగా నష్టాలను మూటగట్టుకున్నాయి. అమెరికా ఎన్నికల ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి భారీ నష్టాల్లో ముగిశాయి. బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఐటీ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి సూచీలను పడేశాయి. సెన్సెక్స్, నిఫ్టీ ఒక్కో శాతం మేర నష్టపోయాయి. అమెరికా ఎన్నికలు, వడ్డీ రేట్లపై త్వరలో మిగతా 2లో...

# పెండింగ్ బిల్లుల కోసం చలో హైదరాబాద్

మెదటిపేజీ తరువాయి

హోటల్ బయటకు వచ్చిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. ఛలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టిన వారిని ఎక్కడికక్కడ పోలీసులు అరెస్ట్ చేశారు. తమ సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి వెళ్లి వినతి పత్రం ఇవ్వనున్నామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సర్పంచుల ను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టులు చేసారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో సమావేశమైన మాజీ సర్పంచులను అదుపులోకి తీసుకున్నారు. దీంతో రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, రాష్ట్ర ఉపాధ్యాక్షులు గుండి మధుసూదన్ రెడ్డి, రేపాక నాగయ్య, గుర్రాలదండి ఆంజనేయులు, దుంప ఆంజనేయులుతోపాటు పలువురు మాజీ సర్పంచులను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా ధరాకు మద్దుతగా వచ్చిన మాజీ మంత్రి హరీశ్ రావును అరెస్ట్ చేశారు పోలీసులు. మాజీ సర్పంచులకు మద్దతుగా తిరుమలగిరి పీఎస్ ముందు రోడ్డుపైన హరీశ్ రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు మండలి ప్రతిపక్ష నేత మధుసూధనాచారి, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ సంజయ్ తోపాటు పలువురు నిరసనకు దిగారు. దీంతో పోలీసులు వాళ్లను పీఎస్ కు తరలించారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ ఛలో హైదరాబాద్‌కు మాజీ సర్పంచ్ లు పిలుపునిచ్చారు. అయితే హైదరాబాద్ కు వెళ్లకుండా మాజీ సర్పంచ్ లను ముందస్తుగా అరెస్ట్ చేశారు పోలీసులు . జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్న పలువురు మాజీ సర్పంచులను అరెస్ట్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్లకు తరలించారు. మాజీ సర్పంచుల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సీఎంను కలిసేందుకు వచ్చిన వారిని అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. గ్రామాభివృద్ధి కోసం ఖర్చు చేసిన డబ్బు ఇవ్వాలని కోరితే అరెస్టులు చేస్తారా అని ప్రశ్నించారు. వారంతా అప్పులు తెచ్చి, ఆస్తులు అమ్మి, భార్యాపిల్లల బంగారం తాకట్టు పెట్టారన్నారు. ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన మాజీ సర్పంచులను అరెస్టు చేయడమేనా?అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తారు.. సర్పంచులకు చెల్లించరా? అని నిలదీశారు. మాజీ సర్పంచులను వెంటనే విడుదల చేయాలని.. బిల్లులు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ పోరుబాటకు పిలుపునిచ్చిన మాజీ సర్పంచ్‌లను రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో మాజీ మంత్రి పోస్టు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం ఇవ్వాలని హైదరాబాద్‌కు వస్తే వారిని అడ్డుకోవడం, అక్రమంగా నిర్బంధించడం అప్రజాస్వామికమన్నారు. అప్పులు తెచ్చి, ఆస్తులు అమ్మి, భార్యా పిల్లల మీద ఉన్న బంగారం కుదువ పెట్టి గ్రామ అభివృద్ధి కోసం చేసిన డబ్బులు ఇవ్వాలంటే ప్రభుత్వం అరెస్టులు చేస్తోందని మండిపడ్డారు. ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన సర్పంచ్‌లను అరెస్టులు చేయడమేనా అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ, చిన్న పనులు చేసిన మాజీ సర్పంచ్‌లకు మాత్రం బిల్లులు చెల్లించక పోవడంలో ఆంతర్యం ఏమిటని నిలదీశారు. అక్రమంగా నిర్బంధించిన, అరెస్టులు చేసిన మాజీ సర్పంచ్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్ బిల్లులను తక్షణం చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని హరీష్‌రావు ఎక్స్‌లో పోస్టు చేశారు. పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచులు ఏడాదిగా తిరుగుతున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. వారి కుటుంబాలను రోడ్డున పడేయడం దారుణమని పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న వారిని ఎందుకు అరెస్టు చేస్తున్నారని ప్రశ్నించారు. పల్లె ప్రగతి పేరుతో తాము చేపట్టిన కార్యక్రమానికి తూట్లు పొడిచారని కేటీఆర్ ఆరోపించారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్న మాజీ సర్పంచులను అరెస్టు చేయడాన్ని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఖండించారు. ప్రజాపాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్, రేవంత్ సర్కార్ ఉదయం 4 గంటలకే వారిని అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లలో బంధించడం హేయమైన చర్య అన్నారు. అప్పులు తెచ్చి చేసిన పనులకు బిల్లులు అడిగితే అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు చేసిన పనులకే డబ్బులు ఇవ్వమంటే ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకు ఇంత కోపమొచ్చిదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌కు మాజీ సర్పంచులంటే ఎందుకింత కోమని విమర్శించారు. చిన్న కాంట్రాక్టర్లకు చెల్లించేందుకు డబ్బులు ఉండవు కానీ, బడా కాట్రాక్టులకు కమిషన్ల కోసం బిల్లులు చెల్లించేందుకు డబ్బులు ఉంటాయన్నారు. సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించడానికి డబ్బులు లేవు కానీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజగోపాల్ రెడ్డిలకు ఇవ్వడానికి, రూ.లక్షన్నర కోట్లతో మూసీ ప్రాజెక్ట్ చేపట్టడానికి రేవంత్ రెడ్డి దగ్గర డబ్బు ఉందని మండిపడ్డారు.

పది నెలలుగా అడుగుతున్నా బిల్లులు చెల్లించకుండా సర్పంచ్‌లను ప్రభుత్వం వేధిస్తున్నదని చెప్పారు. ఇప్పటికే గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది, పారిశుద్ధ్యం పడకేసిందని విమర్శించారు. మాజీ సర్పంచ్‌ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ చేసిన మాజీ సర్పంచ్‌లను బేషరతుగా విడుదల చేయాలన్నారు.

## కెనడాలో పరిస్థితులపై కేంద్రం ఆందోళన

**న్యూఢిల్లీ,నవంబర్4(ప్రజాక్షేత్రం:**

కెనడాలో ఖలిస్థానీల దాడిపట్ల కేంద్రం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అక్కడి హిందువులు లక్ష్యంగా దాడులు జరగడం దారుణమని పేర్కొంది. కెనడాలో మరోసారి రెచ్చిపోయిన ఖలిస్థానీలు.. అక్కడి బ్రాంప్టన్‌లోని హిందూ ఆలయాన్ని లక్ష్యంగా చేసుకొని భక్తులపై దాడులు చేశారు. దీనిపై భారత ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడారు. ఉగ్రవాదులు, వేర్పాటువాదుల హింసాత్మక చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాయమని, ఈ తరహా దాడుల నుంచి అన్ని ప్రార్థనాస్థలాలను సంరక్షించాలని మేం కెనడా ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు చెప్పారు. హింసకు కారకులైన వారిని శిక్షిస్తారని మేం ఆశిస్తున్నాం. కెనడాలో మా దేశీయుల భద్రత గురించి భారత ప్రభుత్వం తీవ్ర ఆందోళన చెందుతోంది. భారతీయులకు కాన్సులర్ సేవలు అందించే దౌత్యవేత్తలు ఈ తరహా బెదిరింపులకు తలొగ్గరని జైస్వాల్ అన్నారు. బ్రాంప్టన్‌లోని ఆలయ కాంప్లెక్స్‌లో కొందరు ఖలిస్థానీలు భక్తులపై దాడులు చేస్తున్న వీడియో వైరల్‌గా మారింది. ఈనేపథ్యంలో ఆలయం వద్ద భారీగా భద్రతా దళాలను మోహరించారు. దీనిని ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో తీవ్రంగా పరిగణించారు. అక్కడి ప్రజలు అన్ని మతాలను పాటించే హక్కును కాపాడతామని పేర్కొన్నారు. మరోవైపు కెనడా ఎంపీ చంద్ర ఆర్య స్పందిస్తూ కెనడాలో ఎంత తీవ్రస్థాయిలో హింసాత్మక తీవ్రవాదం పెరిగిపోయిందో ఈ ఘటన చెబుతోందన్నారు. కెనడా హిందువులు ముందుకొచ్చి తమ హక్కులను కాపాడుకోవాలన్నారు. బ్రాంప్టన్‌లోని హిందూ ఆలయం వెలుపల నిర్వహిస్తోన్న కాన్సులర్ క్యాంప్‌పై ఖలిస్థానీ మద్దతుదారులు దాడి చేయడం తీవ్ర నిరాశపరిచిందని ఒట్టావాలోని ఇండియన్ హై కమిషన్ వ్యాఖ్యానించింది. గత కొన్ని నెలలుగా కెనడాలోని ఆలయాలపై వరుసగా దాడులు జరుగుతున్న విషయం తెలిసిందే. అక్కడి ఆలయ గోడలపై భారత వ్యతిరేక నినాదాలను రాసిన ఘటనలు చోటుచేసుకున్నాయి.

## బాణాసంచా నిషేధాన్ని ఎందుకు అమలు చేయలేదు

మెదటిపేజీ తరువాయి

ప్రాంతంలో గాలి నాణ్యత సూచి 400 మార్క్‌ని దాటింది. పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని డిసెంబర్ 2, 2016న ఎంసీ మెహతా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పును ఇచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఢిల్లీలో గ్రాప్ పాలసీని అమలులోకి తీసుకువచ్చారు. చలికాలంలో వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ఇందులో పలు నిబంధనలు ఉన్నాయి. ఇందులో బాణాసంచాపై నిషేధం సైతం ఉన్నది. వాయు కాలుష్యంపై ఢిల్లీ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు సోమవారం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. బాణాసంచా నిషేధాన్ని ఎందుకు అమలు చేయడం లేదని సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. నిషేధం ఉంటే పటాకులు ఎలా పేల్చారు? వీలైనంత త్వరగా సమాధానం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. దేశ రాజధాని ఢిల్లీలో వాయుకాలుష్యం పెరిగిపోవడంతో మార్నింగ్ వాక్ చేయడం మానేస్తున్నట్లు సీజేఐ చంద్రచూడ్ గురువారం వ్యాఖ్యానించారు. శ్వాసకోశ వ్యాధులను నివారించడానికి ఇంట్లోనే ఉండటమే మంచిదని, ఉదయాన్నే బయటకు వెళ్లకుండా ఉండాలని డాక్టర్ సలహా ఇచ్చారన్న ఆయన.. వాయుకాలుష్యం పెరుగుతుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

## ఆరులక్షల కోట్లు ఆవిరి

మెదటిపేజీ తరువాయి

ఫెడ్ తన నిర్ణ యాలను ప్రకటించనుండడంతో మదుపర్లు అప్రమత్తంగా వ్యవ హరించారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలు నవంబర్ 5న జరగ నుండ టంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లపై ఇది ప్రభావం చూపించే అంశం గా నిలిచింది. ఫెడ్ వడ్డీ రేట్ల నిర్ణయాలు ఈ నెల 7న వెలువ డనుండడంతో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. ఇంట్రాడే లో సెన్సెక్స్ దాదాపు 1500 పాయింట్ల మేర నష్టపోగా.. ఆ తర్వాత కాస్త కోలుకుంది. నిఫ్టీ 24 వేల మార్కును కోల్పో యింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.6 లక్షల కోట్లు క్షీణించి రూ.448 లక్షల కోట్ల నుంచి రూ.442 లక్షల కోట్లకు చేరడం గమనార్హం. సెన్సెక్స్ ఉదయం 79,713. 14 స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. క్రమంగా భారీ నష్టాల్లోకి జారుకుం ది. ఆద్యంతం నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 78,232.60 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 941.88 పాయింట్ల నష్టంతో 78,782.24 వద్ద ముగిసింది. నిఫ్టీ 309 పాయింట్ల నష్టంతో 23,995.35 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ జీవనకాల కనిష్ఠమైన 84.11 స్థాయికి చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో మహీంద్రా అండ్ మహీం ద్రా, టెక్ మహీంద్రా, ఎస్‌బీఐ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు మినహా అన్ని షేర్లూ నష్టాల్లో ముగిశాయి. అదానీ పోర్ట్స్, రిలయన్స్, సన్‌ఫార్మా, ఎన్టీపీసీ, బజాజ్ ఫిన్‌సర్వ్ ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ 75 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2753 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఇజ్రాయెల్-ఇరాన్‌ల మధ్య ఘర్షణలు పెరుగుతుండటంతో పీపా చమురు ధర సోమవారం రెండు శాతం వరకు పెరిగి 75 డాలర్లకు చేరింది. ఒపెక్? దేశాలు ఉత్పత్తి పెంచే విషయమై పెదవి విరుస్తున్నాయి. మన రూపాయి విలువ భారీగా పతనమైన జీవనకాల కనిష్ఠానికి రూ.84.11 చేరింది. దీంతో భారత విదేశీ కరెన్సీ నిల్వలపై దీని ప్రభావం పడనుంది. చమురు ధరల పెరుగుదల, రూపాయి పతనం వెరసి ఆర్‌బీఐ వద్ద ఉన్న డాలర్ల నిల్వలను తగ్గించే అవకాశం ఉంది. రెండో త్రైమాసిక ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం కూడా మార్కెట్ సూచీల పతనానికి కారణంగా నిలిచింది. విదేశీ పోర్టుఫోలియో మదుపరులు భారీగా పెట్టుబడులను ఉపసంహరిస్తుండటం సూచీలు పడిపోవడానికి మరో కారణంగా నిలిచింది. ఒక్క అక్టోబర్ నెలలోనే వీరు రూ.1,13,858 కోట్లను ఉపసంహరించుకొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

**హైదరాబాద్,నవంబర్4(ప్రజాక్షేత్రం:**

మెరుగైన ఫర్నిచర్, ల్యాబ్స్‌పై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. విద్యానగర్ జామై ఉస్మానియా పాఠశాలకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బెంచీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రైవేటు బడులకు దీటుగా ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు పెరగాలన్నారు. సర్కారు బడుల అభివృద్ధికి సమాజమంతా బాధ్యత తీసుకోవాలని సూచించారు. కర్నాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యం కనిపిస్తోందన్నారు దివాళకోరు, దగాకోరు రాజకీయాలు చేయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందన్నారు. అమలు కానీ హామీలు ఇవ్వడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని కిషన్ రెడ్డి చురకలంటించారు. ఇచ్చిన హామీలకే గతిలేదని, కొత్తగా మళ్లీ హామీలిస్తున్నారన్నారు. కర్నాటకలో హామీలు అమలు చేయలేక చేతులెత్తేశారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో అనేక వాగ్దానాలతో కాంగ్రెస్ అధికారులోకి వచ్చిందని దుయ్యబట్టారు. డిక్లరేషన్, గ్యారంటీల పేరుతో గారడీ చేశారని కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు.

## 8న యాదాద్రిలో సిఎం రేవంత్ పూజలు

మెదటిపేజీ తరువాయి

పైపులైన్ల కు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. మూసీ కోసం పాదయాత్రచేస్తానన్న సిఎం రేవంత్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల పైపులైన్లకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. మూసీ పరివాహ క ప్రాంతాల్లోని రైతులు, ప్రజలను కలిసి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకోనున్నారు. సీఎం పర్యటన క్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య హెలిప్యాడ్, ఆలయ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని నిర్దేశించారు. అటు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ఉమ్మడి నల్గొండ జిల్లా కాంగ్రెస్ నేతలు సమావేశమయ్యారు. ఆయనతో ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు చర్చించారు.


## ఈసీ కీలక నిర్ణయం

మెదటిపేజీ తరువాయి

కార్యక్రమాల కారణంగా బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, ఆర్జేడీ సహా పలు రాజకీయ పార్టీలు పోలింగ్‌ను వాయిదా వేయాలని ఈసీని కోరాయి. సాంస్కృతిక, మతపరమైన కార్యక్రమాల కారణంగా ఓటింగ్ శాతం తగ్గే అవకాశం ఉందని రాజకీయ పార్టీలు ఈసీ దృష్టికి తీసుకెళ్లాయి. వారి అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈసీ ప్రకటించింది. నవంబర్ 13న జరగాల్సిన ఉప ఎన్నికల పోలింగ్‌ను నవంబర్ 20కి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. ప్రభావితమైన 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేరళలోని పాలక్కాడ్, పంజాబ్‌లోని డేరా బాబా నానక్, చబ్బేవాల్, గిద్దర్ బాహా, బర్నాల్, యూపీలోని ఖైర్, మీరాపూర్, కుందర్కి, ఘజియాబాద్, కర్హాల్, సిషామౌ, ఫుల్‌పూర్, కతేహరి, మజావాన్ ఉన్నాయి. అయితే, ఆయా నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపులో మాత్రం ఎలాంటి మార్పూ చేయలేదు.

## సీఎం సహాయనిధికి బిల్లులను అందించిన ఎమ్మెల్యే జారె

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలం ప్రజాక్షేత్రం న్యూస్ నవంబర్ 04**



అశ్వారావుపేట నియోజకవర్గానికి సంబంధించి పలు ప్రైవేట్ ఆసు పత్రు ల్లో చికిత్స పొందిన 85 మందికి సంబంధించిన బిల్లులను సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తులను హైదరాబాద్ సెక్రటేరియట్ సంబంధిత విభా గంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సోమవారం అందజేశారు. మెరుగైన వైద్య చికిత్స పొందలేని పేదలకు సీఎం సహాయనిధి కొండంత భరోసా అని ఎమ్మెల్యే చెప్పారు.

## జార్ఖండ్‌లో హోరెత్తిన ప్రచారం

మెదటిపేజీ తరువాయి

నిర్మూలనకు భాజపా కట్టుబడి ఉందన్నారు. ఎన్డీయే కూటమి ప్రచారంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం రాష్ట్రంలోని ఛాయ్‌బస పట్టణంలో ఎన్నికల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీజేపీ సారధ్యంలోని ఎన్డీయే కూటమి జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో తప్పకుండా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తనకు ఇది రెండవ ర్యాలీయే అయినప్పటికీ గెలుపుపై ఇప్పటికే నమ్మకం కుదిరిందని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారం కోసం తొలిసారి ఇక్కడి వచ్చాను. ఇది నాకు రెండవ ఎన్నికల ర్యాలీ. ఈ రెండు ర్యాలీలు చూసిన తర్వాత.. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా సగాని కంటే ఎక్కువ సీట్లను బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కూటమి గెలుచు కుంటుందని నేను నమ్మకంతో చెప్పగలను అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. గిరిజన సోదర, సోదరీమణుల ఆకాంక్షలకు అనుగుణంగా బీజేపీ ఏవిధంగా పనిచేస్తోందో మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇక కేంద్రంలో బీజేపీ తొలిసారి ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పుడు గిరిజన సమాజం కోసం ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందని ప్రస్తావించారు. గిరిజనఅక్కచెల్లెళ్లు, అన్నదమ్ముళ్ల ఆత్మ గౌరవమే బీజేపీకి అత్యంత ముఖ్యమైనదని మోదీ అన్నారు. అందుకే తొలిసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు గిరిజనుల కోసం రాష్ట్రాన్ని ఇచ్చామని అన్నారు. ఢిల్లీ నుంచి పని చేసే అవకాశం అటల్ బిహారీ వాజ్‌పేయికి దక్కిందని, ఆయన హయాంలోనే గిరిజన రాష్ట్రాలు ఏర్పడ్డాయని మోదీ గుర్తు చేశారు. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ వాజ్‌పేయి హయాంలోనే ఏర్పాటు అయ్యాయని మోదీ చెప్పారు. ఇక రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సమస్యల పరిష్కారంపై దృష్టిసారిస్తామని మోదీ హామీ ఇచ్చారు. ధరలు తగ్గించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇక చట్టవిరుద్ధంగా గిరిజన కూతుళ్ల నుంచి గుంజుకున్న భూములను వెనక్కి ఇప్పిస్తామని మోదీ హామీ ఇచ్చారు. జార్ఖండ్ రాష్ట్ర గుర్తింపును మసకబార్చుతున్నారని జేఎంఎం-కాంగ్రెస్-ఆర్జేడీ కూటమిపై మోదీ తీవ్ర విమర్శలు గుప్పించారు. జార్ఖండ్ గుర్తింపు మార్చివేసే కుట్ర జరుగుతోందని మోదీ అన్నారు. రాష్ట్రంలో చొరబాటుదారులకు జేఎంఎం-కాంగ్రెస్- ఆర్జేడీ మద్దతిస్తున్నాయని అన్నారు. చొరబాటుదారులే వారి అతిపెద్ద ఓటు బ్యాంక్. జేఎంఎం, కాంగ్రెస్ పార్టీలు చొరబాటుదారుల కోసం ఫేక్ సర్టిఫికేట్లు తయారు చేస్తున్నాయి. గిరిజన ఆడబిడ్డలను చొరబాటుదారులు టార్గెట్‌గా చేసుకుంటున్నారు. ఆడ కూతుళ్ల నోటి కాడా కూడు, భూమి లాక్కుంటున్నారు. అంతేకాదు జేఎంఎం, కాంగ్రెస్ కూటమి స్కూళ్లు, కాలేజీలు, యూనివర్సిటీలను మైనారిటీ ఇన్‌స్టిట్యూషన్లను ప్రకటిస్తున్నాయి. ఈ విద్యా సంస్థల్లో దళితులు, గిరిజనులు, ఓబీసీల రిజర్వేషన్లకు ముగింపు పలుకుతున్నాయని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే సీతా సోరెన్‌ను అవమానించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ దేశంలోని మహిళలను కించపరిచిందన్నారు. జేఎంఎం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం యువతను రిక్రూట్‌మెంట్ మాఫియాకు అప్పగించి.. పేపర్ లీక్‌లతో వారి భవిష్యత్తు నాశనం చేస్తోందని మోదీ మండిపడ్డారు. ఆదివాసీల సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని కూడా కాంగ్రెస్ ఆలోచించలేదని.. ఈ పని ఎన్డీయే చేసిందన్నారు.

## నేడే అమెరికా అధ్యక్ష ఎన్నికలు

మెదటిపేజీ తరువాయి

బ్లూ, స్వింగ్ స్టేట్స్ అంటారు. 1980 నుంచి రిపబ్లికన్స్ విజయం సాధిస్తున్న వాటిని రెడ్ స్టేట్స్ అంటారు. అలాగే 1992 నుంచి డెమోక్రాట్లకు అనుకూలంగా ఉన్న రాష్ట్రాలను బ్లూ స్టేట్స్ అంటారు. ఇక స్వింగ్ స్టేట్స్‌లో రెండు పార్టీల మధ్య గెలుపోటములు దోబూచులాడుతాయని భావిస్తారు. ఈసారి ఎవరు గెలిచినా స్వల్ప మెజారిటీతోనే గెలువనున్నారు. ఎందుకంటే పోటీ చాలా తీవ్రంగా ఉన్నది. రాయిటర్స్, ఐపిఎస్ఓఎస్ పోల్ గత వారం అక్టోబర్ 29న ప్రచురించిన దాని ప్రకారం కమలా హారిస్ కే ఆధిక్యత ఉంది. సింగిల్ పర్సంటేజ్ ఆధిక్యతతో డెమో క్రట్లు ఉన్నారు. డెమోక్రాట్లు 44 శాతం, రిపబ్లికన్లు 43 శాతం మేరకు ఓట్లు పొందనున్నారని అంచనా. ఓ సర్వే ప్రకారం స్వింగ్ స్టేట్స్ అరిజోనా, జార్జియా, మిచిగాన్, నెవడా, నార్త్ కరోలినా, పెన్సిల్వేనియా, విస్కాన్సిన్ లలో రిపబ్లికన్ నామినికే మొగ్గు ఉంది. అమెరికాలో ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త నేట్ సిల్వర్ తాజాగా తన అంచనాలను వెల్లడించారు. ట్రంప్-హారిస్‌ల మధ్య హోరాహోరీ పోరు తప్పదన్నారు. అయితే కొంచెం మొగ్గు మాత్రం రిపబ్లికన్ల వైపే ఉందని చెప్పారు. ఈమేరకు న్యూయార్క్ పోస్టు కథనం ప్రచురించింది. సిల్వర్ మోడల్ అంచనాల ప్రకారం ట్రంప్‌నకు ఎలక్టోరల్ కాలేజ్‌లో 51.5 శాతం ఓట్లు లభించే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. హారిస్ వైపు 48.1శాతం మంది మొగ్గు చూపుతున్నారన్నారు. ఈసందర్భంగా నేట్ సిల్వర్ మాట్లాడుతూ.. న్యూయార్క్ టైమ్స్ స్వింగ్ స్టేట్స్ పోల్స్ హారిస్‌కు సానుకూలంగా ఉన్నా.. అద్భుతంగా మాత్రం లేవు. అలానే మార్నింగ్ కన్సల్టెంట్‌వి ట్రంప్‌నకు మంచిగానే ఉన్నా.. అమోఘంగా లేవు. ఇది పూర్తిగా హోరాహోరీ పోరే అని విశ్లేషించారు. రిపబ్లికన్లకు పట్టున్న అయోవాలో ట్రంప్ వెనుకం జలో ఉన్నారంటూ సెజలెర్ సర్వే శనివారం ప్రకటించడాన్ని నేట్ సిల్వర్ ప్రస్తావించారు. ఆ ఒక్క రాష్ట్రంతో అధ్యక్ష పదవి వచ్చే అవకాశం లేదన్నారు. ఆదివారం ఉదయం వరకు సిల్వర్ తాను చేపట్టిన నేషనల్ పోలింగ్ యావరేజ్‌ను విడుదల చేశారు. దీనిలో దేశవ్యాప్తంగా చూసుకొంటే హారిస్‌కు 48.5శాతం ఓట్లు రాగా.. ట్రంప్‌నకు 47.6 శాతం ఓట్లు లభించాయి. కానీ, స్వింగ్‌స్టేట్స్ అయిన నార్త్ కరోలినా, పెన్సిల్వేనియా, నెవడా, జార్జియా, అరి జోనాల్లో ట్రంప్ స్వల్ప ఆధిక్యంలో ఉన్నట్లు పేర్కొన్నారు. హారిస్ కు మిషిగన్, విస్కాన్సిన్‌లో ఆధిక్యం చూపుతు న్నట్లు పేర్కొన్నారు. ఇకపోతే అమెరికా అధ్యక్ష ఎన్నికలను ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. ఇప్పటికే ముందస్తు ఓటింగ్ మొదలుకాగా.. నవంబర్ 5న పోలింగ్ జరగనుంది. ఓటర్లకు సౌలభ్యంగా ఉండేందుకు ఆయా రాష్ట్రాలు వివిధ భాషల్లో బ్యాలెట్‌లను అందుబాటులో ఉంచుతున్నాయి. ఈ క్రమంలో న్యూయార్క్ రాష్ట్రం ఇంగ్లిష్‌కు అదనంగా మరో ఐదు భాషల్లో వీటిని ముద్రిం చగా.. అందులో భారతీయ భాష 'బెంగాలీ' ఉండటం విశేషం. ఎన్నికల ప్రక్రియలో ఇంగ్లిష్ కాకుండా మరో నాలుగు భాషలకు చోటు కల్పించారు. చైనీస్, స్పానిష్, కొరియన్, బెంగాలీ భాషల్లో బ్యాలెట్ అందుబాటులో ఉందని న్యూయార్క్ రాష్ట్ర ఎన్నికల ఎగ్జి క్యూటివ్ డైరెక్టర్ మైఖేల్ జే రియాన్ పేర్కొన్నారు.

ఇక్కడ స్థిరప డిన వారికి ఇంగ్లిష్ తెలిసినప్పటికీ మాతృ భాషలో అందుబాటులో ఉండటం ఆయా ప్రాంతాల వారికి సంతోషకర అంశమన్నారు.

## యాప్ ద్వారా ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక

మెదటిపేజీ తరువాయి

మొదలవుతుందని చెప్పారు. ఖమ్మం రూరల్ మండలం దానావాయి గూడెంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ... ఈయాప్ ద్వారా ఇళ్ల నిర్మాణం పరిశీలన జరుగుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం కోసం రూరల్‌లో రూ.71 వేలు , అర్బన్‌లో లక్షా యాభై వేలు రూపాయలు ఇస్తుందని తెలిపారు. మిగిలిన డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం భరించి పేదవారి చిరకాల స్వప్నం నెరవేరుస్తుందని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వంలో పింక్ కలర్ చొక్కా వేసుకున్న వారికే స్కీంలు ఇచ్చారని.. వారు ఇంకా అదే భ్రమలో ఉన్నారని విమర్శించారు. గ్రామ సభలు పెట్టి మంత్రుల ద్వారా ఇళ్లను అప్రూవ్ చేస్తామని అన్నారు. ఈ ప్రభుత్వానికి పేదవారికి అండగా ఉండాలనే ఆలోచన ఉందని స్పష్టం చేశారు.

అర్హులైన వారు ఏపార్టీలో ఉన్నా వారికి ఇళ్లు ఇస్తామని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వంలో లక్షా యాభై వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టామని బీఆర్ఎస్ నేతలు చెప్పారని అన్నారు. కేవలం 91వేల ఇళ్లు మాత్రమే కట్టి అందులో మౌలిక వసతులు కల్పిం చలేదని ధ్వజమెత్తారు. తెలంగాణలో 63 వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లు వివిధ దశల్లో నిలిచి పోయాయని..

వాటిని కూడా యుద్ధ ప్రాతి పది కన పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు.

## సొంత ఆస్తిని అక్రమంగా కాజేసిన జనసేన నాయకుడుపై చర్యలు తీసుకోవాలి

- బాధితురాలు పి.భారతి అనకాపల్లి జిల్లా కలెక్టర్, ఎస్పీకి వేడుకోలు



**విశాఖపట్నం, నవంబర్ 4(ప్రజాక్షేత్రం):**

తప్పుడు డాక్యుమెంట్లతో మోసం చేసి అనకాపల్లిలో తన సొంత ఆస్తిని అక్రమంగా కాజేసిన జనసేన నాయకుడు బి.సురేష్ పై చట్టపరమైన చర్యలు తీసుకొని, సెటిల్మెంట్ దస్తావేజు రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని, తనకు తగిన న్యాయం చేయాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్కు, జిల్లా ఎస్పీకి బాధితురాలు పి.భారతి వేడుకున్నారు. సోమవారం విజేఎఫ్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె పడుతున్న కష్టాన్ని వివరించారు. తన అమ్మమ్మ బుద్ధ సత్యవతి నుంచి వారసత్వంగా 150 గజాల విస్తీర్ణం గల పాత ఇల్లు గిఫ్ట్ డీడ్ ద్వారా పడిందని, ఆ ఆస్తిని కాజేసేందుకు తనకు దగ్గర బంధువైన జనసేన నాయకుడు బి.సురేష్ రాజకీయ పరపతితో అన్ని విధాల వేధింపులకు, భయభ్రాంతులకు గురి చేస్తూ బలవంతంగా తన ఆస్తిని రిజిస్ట్రేషన్ సబ్ రిజిస్టర్ ఆఫీస్ లో చేయించుకుని చేతిలో అతి తక్కువ నగదు పెట్టి మిగతా సొమ్ము ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇంతే కాకుండా తన అమ్మమ్మ ఎకరం వ్యవసాయ భూమిని కూడా కాజేయడానికి ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. ఆస్తి ఒరిజినల్ డాక్యుమెంట్లు గతంలో తాను అప్పు తెచ్చుకున్న కోటేశ్వరరావు అనే వ్యక్తి దగ్గర ఉన్నాయని, సరైన డాక్యుమెంట్లు లేకుండా బలవంతంగా తన ఆస్తిని సెటిల్మెంట్ దస్తావేజు రిజిస్ట్రేషన్ అక్రమంగా చేసుకుని వేధిస్తున్నాడని ఆమె ఆరోపించారు. పోలీసులకు, అనకాపల్లి సబ్ రిజిస్టర్ కు ఫిర్యాదు చేసిన న్యాయం జరగలేదని ఈ విషయంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ విచారణ చేసి న్యాయం చేయాలని, తన ఆస్తిని ఇప్పించాలని ప్రార్థించారు.

## ఐకెపి వివోఏల సమస్యలు పరిష్కారం చేయాలి

- ప్రతినెల వేతనాలు చెల్లించడంలో జాప్యం ఎందుకు?
- కనీస వేతనం 26000 ఇవ్వాలి.



**కొండాపూర్ ప్రజాక్షేత్రం నవంబర్ 4**

ఐకెపి వివోఎలా సమస్యలు పరిష్కారం చేయాలని నేడు ఐకెపి వివోఏ కొండాపూర్ సిఐటియు అనుబంధ యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో వెలుగు ఆఫీస్ ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటి యు కొండాపూర్ మండల కన్వీనర్ బాబురావు మాట్లాడుతూ సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని అన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం కనీస వేతనం అధికారంలోకి వస్తే అమలు చేస్తానని చెప్పి సంవత్సరం నడుస్తున్న అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని ఆయన అడ్డుపడ్డారు కనీస వేతనం 26 వేలుగా నిర్ణయించి సెరుపు ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు, శ్రీనిధి ఇన్సెంటివ్ బకాయిలను గ్రామ సంఘాలకు ఇవ్వాలని అన్నారు, గత ప్రభుత్వం ఇచ్చిన జీవ ప్రకారం గ్రామ సంఘము నుండి 3000 వేతనం ఇవ్వాలని అన్నారు, ప్రతి గ్రామ సంఘానికి ట్యాబు నెట్టు సౌకర్యం కల్పించాలని కోరారు, 20 లక్షల సాధారణ బీమా ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, మూడు నెలలకు ఒకసారి వివోఏ రెన్యువల్ పద్ధతి తీసివేయాలని అన్నారు, ప్రతినెలా ఒకటో తారీఖున వేతనాలు ఇవ్వాలని అన్నారు, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని పరిష్కారం చేయాలని కోరారు వినుపక్షంలో ఈనెల 11, 12 తేదీలలో సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం ఎదుట 48 గంటల పాటు ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్, జ్యోతి, నాయకులు రాజా గౌడ్, సురేష్, విజయలక్ష్మి, మమ్మీ శ్రీ, అండలు తదితరులు పాల్గొన్నారు.

## కడుపుబ్బా నవ్వించిన ఫ్రెండ్స్ కామెడీ



**విశాఖపట్నం, నవంబర్ 4(ప్రజాక్షేత్రం):**

ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ "వినోదాల విందు 'స్థానిక పౌరగ్రంధాలయం.లో నిర్వహించారు. క్లబ్ సభ్యులు ఎం వి. సుబ్రహ్మణ్యం.జబర్దస్త్ ప్రకాష్. డేవిడ్ రాజు.కుమారి.చిదంబరం శివజ్యోతి.భాను.ప్రకాష్ . నాయుడు. పోర్ట్ శేషు. ఈమంది ఐశ్వరరావు. సీత తదితరులు కామెడీ స్కిట్స్, స్టంట్ మాస్టర్. జ్యోతిష్యం.తంసప్ రికార్డు. చికెన్ 65, 500రూపాయలు అప్పు, డాక్టర్. బర్డే గిఫ్ట్. హొటలరూమ్. మెడ పట్టేసింది వంటి లఘు నాటికలు ప్రదర్శించారు. కార్యక్రమంలో భాగంగా హరి హర నృత్య నీకేతన్ నాట్య గురువు అల్లు వెంకట రమణ పర్యవేక్షణ లో అల్లు అనూష. కోట అనూష. మామిడి శెట్టి హృతిక. కోరాడ గాయత్రీ శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శించారు. కళాకారులకు సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్ మూర్తి . కొన మహేష్. తిలక్ పట్నాయక్, దాడి సత్యనారాయణ చేతులు మీదుగా బహుమతులు అందించారు. కలియుగ వీరబాహుడు, నంది అవార్డు గ్రహీత, ఇంటినేషనల్ భాక్సర్ వంకాయల మారుతీ ప్రసాద్, జబర్దస్త్ ప్రకాష్ లను ఈ సందర్భంగా నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఎం వి సుబ్రహ్మణ్యం నిర్వహణ లో జరిగిన ఈ కార్యక్రమంలో ఇటీవల మరణించిన విధివిలాసం మాసపత్రిక ఎడిటర్ చింతప్రభాకర్ కు శ్రద్ధాంజలి ఘటిస్తూ 2 నిమిషాలు మౌనం పాటించారు.

# విశాఖపట్నం పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాలు ఐక్య వేదిక

- 10గంటలకు పోర్టు ఎఓబి వద్ద జరిగబోయే మహాధర్నాను జయప్రదం చేయండి
- విశాఖ పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సిఐటియు జగదాంబ ఆఫీస్‌లో ప్రెస్‌మీట్ జరిగింది.
- ప్రెస్ మీట్ వివరాలు క్రిందన తెలియజేస్తున్నాము.



**విశాఖపట్నం, నవంబర్ 4(ప్రజాక్షేత్రం):**

పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను సాలిగ్రాంపురంలో 1984వ సంవత్సరంలో 150 పడకల సామర్థ్యంతో నిర్మించారు. పోర్టు %ఆ% డాక్ అధికారులకు, ఉద్యోగులకు, కార్మికులకు, రిట్కైర్ అయిన కార్మికులకు, ఫ్యామిలీ పెన్షనర్లకు, పూల్ కళాశీలకు, సిహెచ్‌డి క్యాజువల్ కార్మికులకు మరియు సిఐఎస్‌ఎఫ్ ఉద్యోగులు వారి వారి కుటుంబ సభ్యులకు దశాబ్దాల తరబడి 40వేల మందికి సేవలందిస్తున్నది. అటువంటి మన పోర్టు హాస్పిటల్‌ను పిపిపి పద్ధతిలో "మల్టీ డిసిప్లైనరీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్"గా 300పడకల నిర్మాణం కొరకు ప్రైవేట్‌వారికి ఇచ్చుటకు పోర్టులో వున్న యూనియన్స్ అన్నీ వ్యతిరేకించినా కేంద్ర ప్రభుత్వం, పోర్టు యాజమాన్యం ఏకపక్షంగా నవంబరు 8న టెండరు ఓపెన్ చేస్తున్నారు. ఈ చర్య 40 వేల మంది ఆరోగ్య భద్రతను ప్రైవేట్ చేతుల్లో పెట్టడమే. ఇదే జరిగితే ప్రైవేట్ యాజమాన్యం దయాదాక్షిన్యాలపై ఆధారపడాల్సి వస్తుంది. తేది : 08%-11-%2024న ఉ? 10గంటలకు పోర్టు ఎఓబి వద్ద జరిగబోయే మహాధర్నాలో పెద్ద ఎత్తున పోర్ట్ డాక్ ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు, క్యాజువల్ వర్కర్లు, పూల్ కార్మికులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్నాము. పోర్టుల్లో పిపిపి/బిఓటి విధానాలు విఫలమయ్యాయని గతంలో స్వయంగా 'కాగ్' (కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్) మొట్టికాయలు వేసిన సంగతి విధితమే. గతంలో కార్మిక సంక్షేమ కోసం స్పోర్ట్స్ కాంప్లెక్స్, కళావాణి ఆడిటోరియం నిర్మిస్తే అది ప్రైవేటుపరం చేయడంతో కార్మికులు వాటి ప్రయోజనాలకు దూరమయ్యారు. పై అనుభవాల దృష్ట్యా ఒకసారి ప్రైవేట్‌చేతుల్లోకి వెళితే తిరిగి పోర్టు చేతుల్లోకి వచ్చే అవకాశం లేదు. ఇప్పుడు హాస్పిటల్‌కి కూడా అదే గతి పడుతుంది. పోర్టు%ఆ%డాక్ కార్మికులు పెన్షనర్లు, పూల్ మరియు కాజువల్ కార్మిక కుటుంబాలు వైద్యానికి దూరమవుతారు. ప్రారంభంలో బ్రహ్మాండంగా వుంటుందని భ్రమలు కల్పిస్తారు. తరువాత కాలంలో ఇది ఒప్పందంలో లేదు, అది ఒప్పందంలో లేదు, ధరల పెరిగాయి, ఇది వర్తించదు అది వర్తించదు, మీరు డబ్బులు చెల్లిస్తే గాని కుదరదని కరాఖండిగా చెబుతారు. మనపై అదనంగా మోయలేని భారం పడుతుంది. ఆరోగ్యం కోసం ఆస్తులను అమ్ముకోవాల్సి వస్తుంది. మనం నష్టపోకుండా ఇప్పుడే అడ్డుకోవాలి. మనం ఐక్యంగా పోరాడితే విజయం మనదే. ఉద్యోగులు మరియు కార్మికులు పొందే వైద్యాన్ని కూడా లాభనష్టాలు బేరీజు వేయడం దుర్మార్గం. 'మెరుగైన వైద్యం అందించడం యాజమాన్యం బాధ్యత-పొందడం ఉద్యోగ, కార్మికుల హక్కు'. పోర్టు హాస్పిటల్ విషయమై ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు అన్ని ఫెడరేషన్ల అభిప్రాయాలు తీసుకొని ముందుకు వెళ్తామని గతంలో హామీ ఇచ్చిన విపిఎ మాట తప్పింది. పోర్టులోనున్న కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా పోర్టు హాస్పటల్‌ను ప్రైవేటీకరించొద్దని స్పష్టంగా చెప్పాయి. ఏపీ హైకోర్టు కూడా హాస్పిటల్ విషయమై కార్మిక సంఘాల అభిప్రాయాలను తీసుకోవాలని చెప్పింది. కార్మికులు, కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా గోల్డెన్ జూబ్లీ హాస్పటల్ ప్రైవేటుకు ఇవ్వడానికి యాజమాన్యం మరియు ప్రభుత్వం ముందుకెళ్లడం చూస్తే ఎంత అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారో తెలుస్తోంది. ఒక ప్రైవేటు వ్యక్తి లాభం కోసం ఆలోచిస్తారు తప్ప సేవ చేయాలని ఆలోచన వుండదు. అందువలన, ఉద్యోగ, కార్మిక, రిట్కైర్ అయిన కార్మికుల కుటుంబాలకు పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను పిపిపి పద్ధతిలో ప్రైవేటు వారికివ్వరాదని, దానికి బదులుగా నిరంతరం లాభాలతో నడుస్తున్న విశాఖ పోర్టు సొంత నిధులతోనే పోర్టు ఆసుపత్రిని మల్టీ-సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని, స్పెషలిస్ట్ డాక్టర్లను, ల్యాబ్ మిషనరీలను, స్పెషలైజ్డ్ స్టాఫ్‌ను, నాణ్యమైన మందులను పోర్టు సొంత నిధులతోనే అభివృద్ధి చేసే చర్యలను చేపట్టాలి. AITUC నాయకులు రమణ బాబు, HMS నాయకులు కె.మంగయ్య నాయడు, CITUనాయకులు బి.జగన్, కె.సత్యనారయణ, బి.లక్మణరావు, జె.సత్యనారయణ,వి రామలింగేశ్వర రావు,CFTUI నాయకులు క్రీష్ణ మూర్తి,INTUC నాయకులు జి.చందు, BMS నాయకులు బి. రవి, ఫెన్షన్స్ సంఘం నాయకులు బి రామారావు తదితరులు పాల్గొన్నారు.

## కార్తీకమాసం జలధారకు వచ్చే భక్తులకు టోల్ గేట్ మినహాయింపు కల్పించాలి

- టోల్ గేట్ బలవంతపు వసూళ్లపై స్థానికులు ఆగ్రహం
- టోల్ గేట్ వసూళ్లకు తగ్గట్టు పార్కింగ్ సదుపాయం లేదని వాహనదారుల ఆవేదన



**మాధవధార, నవంబర్ 4 (ప్రజాక్షేత్రం):**

కార్తీకమాసం మాధవదారలో ఉన్న జలధారకు వచ్చే భక్తులకు టోల్ గేటు ఉపశమనం కల్పించాలని స్థానికులు,భక్తులు, మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అయ్యప్ప స్వామి భక్తులు, మహిళలు మాధవదారలో ఉన్నటువంటి జలధారకు విచ్చేసి పవిత్ర స్నానాలు చేస్తుంటారు.మాధవదార వద్ద ప్రధానంగా మాధవ స్వామి,వేణుగోపాలస్వామి,శివాలయం నకు భక్తులు కార్తీక, మాఘా మాసంలో విచ్చేస్తూ ఉంటారు. ముఖ్యంగా నిత్యం ప్రవహిస్తూ ఉండే జలధారకు మాలధారణ ధరించిన భక్తులు, మహిళలు వస్తూ ఉంటారు. అంతేకాకుండా మాధవదారలో ఉన్న స్మశాన వాటికకు కూడా కర్మలు నిర్వహించేందుకు వస్తూ ఉంటారు.అటువంటి వారి దగ్గర టోల్ గేట్ నిర్వహకులు బలవంతంగా టోల్ వసూలు చేస్తున్నారు. డబ్బు కడితే పైకి వాహనంతో వెళ్ళండి లేకుంటే నడుచుకొని వెళ్లండి అని బదులిస్తున్నారు. సింహాచలం దేవస్థానం వంటి దేవాలయంలో కూడా స్థానికులకు టోల్ గేట్ మినహాయింపు ఉంటుంది కానీ,మాధవదారలో ఉన్న స్థానికులకు టోల్ గేట్ మినహాయింపు ఉండదు అని నిర్వాహకులు తేల్చి చెబుతున్నారు. కనీసం బలవంతపు వసూలుకు తగ్గట్టు కొండపైన పార్కింగ్ సదుపాయం కూడా లేదు.అదేంటని స్థానికులు ప్రశ్నిస్తే పార్కింగ్ సదుపాయం మాకు సంబంధం లేని విషయం అని, మేము కేవలం టోల్ గేట్ రుసుము వసూలు మాత్రమే చేస్తామని బదిలిస్తున్నారు.కొండపైన పార్కింగ్‌కి సరైన రోడ్డు లేక రాళ్లు రువ్విన రోడ్డుపై పార్కింగ్ చేయడం వల్ల వాహనాలు జారిపడి మరమ్మత్తులకు గురి అవుతున్నాయి.జలధార వద్ద స్నానం చేసేటందుకు నాచు పట్టి ఉండడంతో భక్తులు జారి పడుతున్నారు. జలధార వద్ద స్నానమాచరించే మహిళలకు స్నానపు గదులు లేక ఎన్నో ఇబ్బందులకు గురి అవుతున్నారు.కావున సింహాచల దేవస్థానం అధికారులు తక్షణమే పర్యటన చేసి స్థానికులకు,భక్తులకు కార్తీక,మాఘా మాసంలో టోల్ వసూలు నిలిపివేయాలని, జలదార వద్ద కనీస ఏర్పాట్లు కల్పించాలని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అమర్నాథ్ తస్మాత్ జాగ్రత్త గండి బాబ్జి

**విశాఖపట్నం, నవంబర్ 4(ప్రజాక్షేత్రం):**



సీఎం చంద్రబాబు నాయుడు పర్యటన పై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మాటలను ఖండిస్తూ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జి మాట్లాడారు. సచివాలయంలో ఐటీ మంత్రి ఛాంబర్‌లో నీరు కారుతుందని చెబుతున్న మాజీ మంత్రి ఎందుకు బాగుచేసుకోలేక పోయారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మంత్రులు సచివాలయంకు వెళ్ళారా అని ప్రశ్నించారు. స్టార్ హొటల్స్‌లో సమావేశాలు నిర్వహించి ప్రజా ధనాన్ని వైసీపీ మంత్రులు వృధా చేశారు. ప్రజా ధనాన్ని ఖర్చు చేసి ఋషికొండలో భవనాలు ఎందుకు కట్టారో ఎవరికి అర్థం కావడం లేదు. చంద్రబాబు ప్రజలు కోసం కట్టిన ప్రజా వేదికను జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే కూల్చేశారు. జగన్ 11 లక్షల కోట్లు అప్పులు చేశారు. అమర్నాథ్ మంత్రిగా ఉండి ఎన్ని పరిశ్రమలు తెచ్చారు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు విజయసాయిరెడ్డి ని వేసుకొని మరల ఉత్తరాంధ్ర లో పెత్తనం చేలాయించాలని చూస్తున్నారు.వైసీపీ ని వదిలి అనేక మంది బయటకు వస్తున్నారు. అమర్నాథ్ కు రాజకీయ భిక్ష పెట్టింది చంద్రబాబు నాయుడు. అమర్నాథ్ మంత్రిగా ఉన్న సమయంలో ఎంత దోచుకున్నారో అందరికి తెలుసు. మాజీ మంత్రి అమర్నాథ్‌కు బెంగుళూరులో ఉన్న భవనాలు ద్వారా నెలకు కోటి రూపాయిలు అద్దె రూపంలో వస్తుంది అని చెప్పారు.అమర్నాథ్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలి లేదంటే ప్రజలే బుద్ధి చెబుతారు తస్మాత్ జాగ్రత్త అని అన్నారు రాష్ట్ర ప్రజలు వైసీపీ ని 11 సీట్లుకె పరిమితం చేసిన నాయకులకు బుద్ధి రావడం లేదు అని ఎద్దేవా చేశారు జగన్ గడిచిన ఐదేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయంలో అనేక దొంగ జీఓ లు ఇచ్చారు వాటన్నిటినీ సీఎం చంద్రబాబు బయటకు తీస్తున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ని విమర్శించే స్థాయి అమర్నాథ్ కు లేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో స్టీల్ ప్లాంట్ కోసం ఏమి చేశారు. విశాఖ ఉక్కు కోసం ఒక్కసారి అయిన కేంద్రంతో మాట్లాడారా అని ప్రశ్నించారు రైల్వే జోన్‌కు భూమి ఇస్తే ఎందుకు కార్యాల యానికి శంకుస్థాపన చేయించలేక పోయారు. విశాఖ ఉక్కు పరిశ్రమ సమస్య పరిష్కరం చేయాలని సీఎం చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారు అని ఉద్ఘాటించారు ఒకటివ తేదీకి ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నాము. మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ వైసీపీ ని వీడడానికి సిద్ధంగా ఉన్నారు ఆఖరికి ఆ పార్టీ లో జగన్ ఒక్కడే మిగిలిపోతాడు అని పేర్కొన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు గొలగాని వీరా రావు, వురుకూటి నారాయణ పాల్గొన్నారు.

## సమాజ సేవకుల వల్ల సమాజానికి చాలా మేలు!



**విశాఖపట్నం, నవంబర్ 4 (ప్రజాక్షేత్రం):**

సమాజంలో వివిధ రంగాల్లో పలు సేవలు చేస్తున్న సేవారంగ ప్రముఖుల వల్ల సమాజానికి చాలా మేలు జరుగుతోందని సినిమా హీరో కంచెర్ల ఉపేంద్ర తెలిపారు. ముందడుగు-9 న్యూస్ ఆధ్వర్యంలో నగరంలో వివిధ రంగాల్లో పలు సేవలు చేస్తున్న సేవారంగ నిపుణులకు ఘన సన్మానం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సమాజంలో వివిధ రంగాల్లో పలు సేవలు చేస్తున్న వారి వల్ల సమాజానికి చాలా మేలు జరుగుతోం దన్నారు. వారిని గుర్తించి గౌరవించుకోవడం మనందరి బాధ్యతని అన్నారు.ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న విశాఖ ఈస్ట్ డివిజన్ పోలీసు ఎసిపి లక్ష్మణమూర్తి మాట్లాడుతూ సమాజంలో పలు రంగాల్లో వివిధ రకాల సేవలు చేస్తున్న వారి వల్ల చాలా మంది లబ్ధి పొందుతున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా ఓం శాంతి ఆధ్యాత్మిక సంస్థకు చెందిన బ్రహ్మ కుమారి రామేశ్వరి, ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శతాధిక సార్లు రక్త దానం చేసిన నిరంతర రక్త దాత వంకాయల జవహర్, జిల్లెళ్ళమూడి అమ్మ సేవా సమితి కార్యదర్శి మూడడ్ల ఉమా మహేశ్వరరావు, ది ఇండియన్ మహిళా ఫౌండేషన్ అధ్యక్షురాలు జీవిఎల్ పద్మ, విఎన్ గరుడకృష్ణ, ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకుడు పాలపర్తి చిన్న, ఓం శాంతి రమ అక్కయ్య, మిమిక్రీ డోనాల్డ్ డక్ కళాకారుడు బొట్టా నాగేశ్వర రావు, బుర్ర శ్రీనివాసరావు, కాళి జానకిరామ్, జెఎంఆర్ నెహ్రూ, సినీ నటుడు రవితేజ, సినీ గాయకుడు మను తదితరులను ఘనంగా సన్మానించారు.

## ములకలపల్లి ప్రెస్ క్లబ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మరియు మాజీ ఎమ్మెల్యే నాగేశ్వరరావు గారు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజాక్షేత్రం న్యూస్ నవంబర్ 04**

ములకలపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రెస్ క్లబ్ ప్రారంభోత్సవంలో పాల్గొని %చీ=×% తాండ్ర వెంకటేశ్వరరావు గారితో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు గారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి ప్రెస్ క్లబ్ భవనం మన జిల్లాలో మొట్టమొదటిది అని భావిస్తున్నాను అన్నారు. అశ్వరావుపేట నియోజకవర్గంలో మొట్టమొదటిగా ములకలపల్లి మండలంలో ప్రెస్ క్లబ్ భవనం ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉంది అన్నారు. ప్రెస్ మిత్రులు మంచి వార్తలు రాసి పేద ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండి పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు శాలువాతో సన్మానించారు..ఈ కార్యక్రమంలో ములకలపల్లి మండల నాయకులు పాల్గొన్నారు...



ప్రజాక్షేత్రం
PRAJA KSHETRAM
మంగళవారం 05 నవంబర్ 2024

# మాజీ సర్పంచ్‌ల అరెస్ట్ అప్రజాస్వామికం

## - అరెస్టు తీవ్రంగా ఖండించిన బండి సంజయ్



**హైదరాబాద్,నవంబర్4(ప్రజాక్షేత్రం:**

పెండింగ్ బిల్లుల కోసం ఆందోళన చేపట్టిన మాజీ సర్పంచులను అరెస్ట్ చేయడం దుర్మార్గమైన చర్య అని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే పెండింగ్ బిల్లులన్నీ చెల్లిస్తామని చెప్పిన కాంగ్రెస్ మాట తప్పిందని విమర్శించారు. సమస్యను పరిష్కరించకుండా పోలీసులతో ఆందోళనలను అణదొక్కాలని చూడటం అవివేకమన్నారు. అరెస్ట్ చేసిన సర్పంచ్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సర్పంచ్‌లు అప్పుల పాలవడానికి కారకులు భారాస, కాంగ్రెస్ పార్టీలేనన్నారు. అధికారంలోకి రాగానే పెండింగ్ బిల్లులన్నీ చెల్లిస్తామని చెప్పిన కాంగ్రెస్.. మాట తప్పిందని విమర్శించారు. ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఇవ్వాలని విన్నవించినా చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు. సమస్యను పరిష్కరించకుండా పోలీసులతో అణగదొక్కాలని చూస్తారా అని మండిపడ్డారు. కాంగ్రెస్, భారాస పార్టీలకు మాజీ సర్పంచ్ కుంటుంబాల ఉసురు తగులుతుందన్నారు. అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లయిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. యూఎస్‌కు చెందిన 'ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ భాజపా' ఎన్ఆర్ఐ నేతలతో ఆయన దృశ్యమాధ్యమం ద్వారా సమావేశమయ్యారు. అతి తక్కువ కాలంలో కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత నెలకొందని, రాష్ట్రంలో సీఎం హామీలకు విలువ లేకుండా పోయిందన్నారు. దక్షిణాదికి అన్యాయం పేరుతో ఆ పార్టీ దుష్ప్రచారం చేస్తోందని, మీడియా ప్రచారం తప్ప ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. భారాస పనైపోయిందని, ఆ పార్టీలో క్యాడర్ లేరన్నారు. ఆ పార్టీలో కొంతమంది నేతలు అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. 2028 ఎన్నికల్లో తెలంగాణలో భాజపా అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఆదాయం కోసం కాకుండా ఆలయాల్లో ప్రజలకు సేవలందిస్తామని, హిందూ ధర్మం, ప్రజల ఆలోచనలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కనీసం ఐదుగురు విదేశీయులను భారత్‌లో పర్యటించేలా కృషి చేయాలని ఎన్నారైలకు ఆయన సూచించారు. దేశాభివృద్ధి కోసం తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని కోరారు.



## పెద్దేముల్ శ్రీవారి సేవలో.. బిఎంఆర్



**పెద్దేముల్ నవంబర్ 4(ప్రజాక్షేత్రం):**

విస్తృత పర్యటనలో భాగంగా, పెద్దేముల్ మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర దేవాలయాన్ని సోమవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ నేపథ్యంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పంటలు బాగా పండాలని, రైతుల కళ్ళల్లో ఆనందం కనిపించాలని శ్రీ వెంకటేశ్వర స్వామివారిని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం పెద్దేముల్ లోని పలువురు రైతులు తమ పొలాలకు వెళ్లడానికి రహదారి సరిగా లేదు, మాకు మట్టిరోడ్డును నిర్మించాలని ఎమ్మెల్యేని కోరగా, రైతుల యొక్క కోరికను మన్నించి తప్పకుండా మీ పొలాలకు వెళ్లడానికి రోడ్డును నిర్మించేందుకు తన వంతు కృషి చేస్తానని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా వెంటనే నిర్మాణం పనులు చేపట్టాలని స్థానిక పార్టీ కార్యకర్తలకు సూచించారు. ఎంత ఖర్చయినా పర్వాలేదు.. రైతుల అడిగిన రోడ్డును నిర్మించేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని స్థానిక నాయకులకు సూచించారు. రైతులు తమ పొలంలో పండించిన పంటను, ఒడ్డుకు చేర్చాలంటే.. రోడ్డు సరిగ్గ ఉంటేనే అది సాధ్యమవుతుందని, కాబట్టి మీరు అడిగిన రోడ్డును తప్పకుండా వేయిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి ధారాసింగ్,టీపీసీసీ మైనార్టీ కన్వీనర్ రియాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి, జితేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కోళ్ల పెంటప్ప,యువ నాయకుడు మహిపాల్ రెడ్డి, తట్టేపల్లి ఏఎంసి డైరెక్టర్ ఉప్పరి మల్లేశం, గ్రామ కమిటీ అధ్యక్షుడు డివై నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే జారె



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం ప్రజాక్షేత్రం న్యూస్ నవంబర్ 04**

రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారిని హైదరాబాద్ జూబ్లీహిల్స్ మినిస్టర్స్ క్వార్టర్స్ లో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గారు మర్యాదపూర్వకంగా కలిసి అశ్వారావుపేట నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి చర్చించటం జరిగినది. అలాగే నియోజకవర్గ అభివృద్ధి కోసం గతంలో ప్రతిపాదించిన పనుల పురోగతిని తెలుసుకొని అభివృద్ధి కొరకు నిధులు త్వరగా కేటాయించవలసిందిగా మంత్రి గారిని కోరారు.

# ఇళ్లకు రక్షణ ఏది

## - జయరాజ్ స్టీల్ ప్లాంట్ ఓపెన్ బ్లాస్టింగ్ వల్ల దెబ్బతింటున్న ఇళ్లు



**ఓర్వకల్ నవంబర్ 4 ( ప్రజాక్షేత్రం)**

జయరాజ్ స్టీల్ ప్లాంట్ ఓపెన్ బ్లాస్టింగ్ వల్ల దెబ్బతిన్న ఇళ్లకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలి సిపిఐ డిమాండ్..ఈరోజు భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ )ఆధ్వర్యంలో ఓర్వకల్లు మండల తహసిల్దార్ విద్యాసాగర్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ ఓర్వకల్లు మండల సహాయ కార్యదర్శి కామ్రేడ్ సుధాకర్ మాట్లాడుతూ..ఓర్వకల్లు మండలంలోని గుట్టపాడు మరియూ కొంతలపాడు గ్రామంలో జయరాజ్ స్టీల్ ప్లాంట్ ఓపెన్ బ్లాస్టింగ్ వల్ల ఫ్యాక్టరీ పేల్చిన పేలుళ్ల ద్వారా 100 ఇల్లు వరకు బీటలు పారాయి.ఇంట్లో నివసించాలి అంటే భయ భయంగా ఉంది గతంలో చాలా సార్లు అధికారులను కలిసి ఎన్నోసార్లు వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. ఇంతవరకు



ఏలాంటి నష్ట పరిహారం ఇవ్వలేదు.న్యాయం చేయలేదు. బీటలు పారి నేర్రలు ఇచ్చిన ఒక్కొక్క ఇంటికి ఐదు లక్షల రూపాయలు నష్టపరిహారం లేక బిటలుపరిన ఇళ్లకు మరుమత్తులు చేయిం చాలి. అదేవిధంగా జయరాజ్ స్టీల్ ప్లాంట్ లో భూములు కోల్పోయిన రైతులకు ఇంతవరకు చాలామందికి నష్టపరిహారం ఇవ్వలేదు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలి. కొంతమంది రైతులకు చెక్కులు వచ్చిన కూడా గతంలో ఉన్నటువంటి అధికారులు ఇవ్వలేదు. తక్షణమే మీరైనా దయవుంచి చెక్కులు ఇవ్వగలరని కోరుచున్నాము. అదేవిధంగా జయరాజు ప్లాంట్ లో స్థానికంగా ఉన్నటువంటి నిరుద్యోగ యువతకు 75% ఉద్యోగ అవకాశాలు కల్పించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు మహబూబ్ బాషా, రైతులు సుంకన్న, అయస్వాములు మహమ్మద్ మియా తదితరులు పాల్గొన్నారు..

# దళారులకు అమ్మి మోసపోవద్దు

## - తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



**పెద్దేముల్ నవంబర్ 4(ప్రజాక్షేత్రం):**

రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల విస్తృత పర్యటనలో భాగంగా, పెద్దేముల్ మండల పరిధిలోని మంబాపూర్ గ్రామంలో.. డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.


**అనంతరం పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.**

పెద్దేముల్ మండల పరిధిలోని మారేపల్లి గ్రామ శివారులోని కాటన్ మిల్లులలో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రెండు పత్తి కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ సంవత్సరం భారీ వర్షాల కారణంగా, ఆశించిన స్థాయిలో పత్తి, కంది తదితర పంటలు పండక పోగా రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు అని ఆయన పేర్కొన్నారు. కాబట్టి రైతులను మోసం చేయకుండా, ప్రభుత్వం నిర్దేశించిన సిసిఐ రేటు 7500 లకు పత్తిని కొనుగోలు చేయాలని పత్తి మిల్లుల యజమానులకు సూచించారు. రైతులు పండించిన చివరి గింజ వరకు పత్తిని, నిర్ధారించిన రేటుకే కొనుగోలు చేయాలని ఆయన అన్నారు. రైతుల పట్ల ఎవరైనా మోసాలకు పాల్పడితే తప్పకుండా చర్యలు తీసుకుంటామని మిల్లు యజమానులకు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి ధారాసింగ్, ఏఎంసి వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, టిపిసిసి రాష్ట్ర కన్వీనర్ రియాజ్,జితేందర్ రెడ్డి,మండల అధ్యక్షుడు గోపాల్,మహిపాల్ రెడ్డి,ఎఎంసి డైరక్టర్ మల్లేశం,విద్యాసాగర్, డివై నరసింహులు, శోభారాణి, మైపూస్, యాదయ్య, డైరెక్టర్ ఇక్బాల్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేట శివాలయాల్లో భక్తుల సందడి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజాక్షేత్రం న్యూస్ నవంబర్ 04**

అశ్వారావుపేటలో కార్తీక మాసం ఆరంభం, తొలి సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. కార్తీక మాసంలో దేవాలయ సందర్శనకు విశేషమైన ప్రాధాన్యం ఉన్నందున, ప్రతి సోమవారం శివుడి ఆరాధనకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. ఇవాళ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రుద్రపారాయణం, ఆరాధనలు నిర్వహించబడుతూ, భక్తుల సందడి మిన్నంటింది. పెద్ద సంఖ్యలో భక్తులు శివాలయాలకు చేరుకుంటున్నారు.



## నూతన వధువుకు రూ.5000 బహుమతిగా అందించిన "వాసుపల్లి"



**విశాఖపట్నం, నవంబర్ 4 (ప్రజాక్షేత్రం):**

జీవీఎంసీ 39 వ వార్డుకు చెందిన ఒక పేద వివాహ మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త రూ. 5000 లను బహుమతిగా అందజేశారు. గరికిన ధనరాజు అప్పలరాజు దంపతుల ద్వితీయ పుత్రిక దేవి వివాహ వేడుకలకు వాసుపల్లికి ఆహ్వానించారు. ఈ మేరకు ఆయన దేవి వీరబాబు దంపతులను ఆశీర్వచనాలు అందజేస్తూ రూ. 5000 రూపాయలను నగదును సోమవారం ఉదయం ఆశీల మెట్ట కార్యాలయంలో వధువుకు ఇచ్చారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ అన్నవరం దేవస్థానంలో ఈ నెల 9వ తేదీన జరగనున్న గరికిన ధనరాజు కుమార్తె వేడుకలుకి ఆహ్వాన పత్రిక అందించారన్నారు. నియోజకవర్గంలో తనని ఒక కుటుంబ సభ్యుడిగా భావించి వారి కష్టసుఖాలలో తాను కూడా భాగస్వామ్యం అవ్వడం ఆనందంగా ఉందన్నారు. నూతన వధూవరులుగా ఒక్కటి కాబోతున్న దేవి వీరబాబు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు దాంపత్య జీవితాన్ని ఆ భగవంతుడు అందించాలని ఆకాంక్షించారు. పేదల పాలిట ఆపద్బాంధవుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందించిన అనేక సంక్షేమ పథకాలు వారిని ఆదుకునేవన్నారు. ఇప్పటికీ వైయస్సార్, వైయస్ జగన్ పేదలకు చేసిన మంచి పనులు వారిని ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంచాయన్నారు. అటువంటి మహనీయులను ఆదర్శంగా తీసుకొని తన వంతు సాయంగా నియోజకవర్గ ప్రజలకు కష్టసుఖాల్లో తోడు ఉంటున్నానని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్కుమార్ ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో 30 వార్డ్ వైయస్సార్సీపి యువ నాయకుడు తాడి రవితేజ, వలిశెట్టి లక్ష్మి, చింతకాయల వాసు పాల్గొన్నారు.

## వ్యవసాయ క్షేత్రంలో మంత్రి తుమ్మల



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం ప్రజాక్షేత్రం న్యూస్ 04**

పాలన, పార్టీ కార్యక్రమాలతో నిత్యం బిజీగా ఉండే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన స్వగ్రామమైన దమ్మపేట మండలం గండుగులపల్లిలోని తమ వ్యవసాయ క్షేత్రంలో సోమవారం ఉదయం కాసేపు గడిపారు. పచ్చని పంట పొల్లాల్లో కలియ తిరుగుతూ ప్రకృతిని ఆస్వాదించారు. ఆయిల్ పామ్ సాగులో ఇంకా తీసుకోవాల్సిన చర్యలు, సస్య రక్షణ పద్ధతుల గురించి కూలీలతో చర్చించారు.

## ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలి: బి సత్యనారాయణ.



**పెద్దేముల్ నవంబర్ 4(ప్రజాక్షేత్రం):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి బి సత్యనారాయణ పేర్కొన్నారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ,కుల సర్వేను ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా, పారదర్శకంగా జరిగేలా చూసుకోవాలని ఎన్యూమరెటర్లకు, సూపర్వైజర్లకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సర్వే నిమిత్తం గ్రామాలలోకి వెళ్లినప్పుడు, ఇంటి యజమానితో వినయంతో సమాధానాలు అడిగి ఎలాంటి తప్పులు లేకుండా ఫామ్ నింపాలని ఆయన తెలిపారు. యజమాని ఇచ్చిన వివరా లు మాత్రమే ప్రొఫార్మాలో పొందుపరిచాలని సూచించారు. ఏమైనా సందే హాలు ఉంటే, నివృత్తి చేసుకొని ఇచ్చిన పారాల్లో క్రోడీకరించాలని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బి.సత్యనారాయణ, తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్, ఎంపీడీవో జర్నప్ప, ఎంపీఓ రతన్ సింగ్,ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## మనస్థాపంతో మహిళా మృతి

**మాక్లూర్ నవంబర్ 4( ప్రజాక్షేత్రం )**



కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడిన ఓ మహిళ మృతి చెందిన ఘటన మాక్లూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... ముల్లంగి గ్రామానికి చెందిన గంగామణి (52 సం"లు )కొడుకు,కోడలు సంసార విషయంలో గొడవల కారణంగా మనస్థాపం చెంది గంగామణి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని మృతి చెందినట్లు తెలిపారు.మృతురాలలి భర్త గంగాధర్ ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్.ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఈనెల 6న జరిగే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాదిగల ధర్మయుద్ధ సదస్సును జయప్రదం చేయండి

- మాదిగలను నమ్మించి మోసం చేసిన రేవంత్ సర్కార్
- SC వర్గీకరణ లేకుండా ఉద్యోగాలు భర్తీ చేయవద్దు
- వర్గీకరణ ద్వారానే మాదిగల భవిష్యత్
- సుప్రీం కోర్ట్ తీర్పును వెంటనే అమలు చేయాలి
- ఈనెల 6న జరిగే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాదిగల
- ధర్మయుద్ధ సదస్సును జయప్రదం చేయండి
- 6 న తుక్కు గూడాకు మందకృష్ణ మాదిగ గారు రాక
- భైరపోగు శివకుమార్ మాదిగ
  ఎం ఎస్ ఎఫ్ ఉమ్మడి రంగారెడ్డి ఇంచార్జీ




**శంషాబాద్ నవంబర్ 04 (ప్రజాక్షేత్రం):**

ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా సీఎం రేవంత్ రెడ్డి కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ మాదిగలను మోసం చేస్తున్న విధానాన్ని నిరసిస్తూ ఈనెల 6 న జిల్లా కేంద్రంలో జరుగు మాదిగల ధర్మయుద్ధ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సదస్సు జయప్రదం చేయాలనీ శివకుమార్ మాదిగ పిలుపు నిచ్చారు. శంషాబాద్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎం ఎస్ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంచార్జి భైరపోగు శివకుమార్ మాదిగ హాజరై మాట్లాడుతూ.... రేవంత్ రెడ్డి మాదిగలతో తియ్యగా మాట్లాడి, మాదిగలపట్ల ఎంతో ప్రేమ ఉన్నట్లు నటిస్తూ మాదిగలకు ద్రోహం చేస్తున్నాడని అన్నారు. ఆగస్ట్ 1న సుప్రీం కోర్టు ఎస్సి ఉప వర్గీకరణ చేసుకోవచ్చు అని తీర్పు ఇచ్చింది సుప్రీం కోర్టు తీర్పు వచ్చిన అర్ధగంటలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ లో మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటిగా తెలంగాణలోనే వర్గీకరణ చేస్తామని ప్రకటించారు. తెలంగాణలో ఏ నోటిఫికేషన్ వచ్చిన వర్గీకరణ అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ అసెంబ్లీలో హామీ ఇచ్చారు. కానీ,రెండు నెలలు తిరుగక ముందే మాట మార్చిన రేవంత్ రెడ్డి మాదిగలకు ద్రోహం చేశారు అని విమర్శించారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం వర్గీకరణలో మొట్టమొదటి రాష్ట్రం ఐతదని మాదిగలు ఎంతో సంతోషించారు అన్నారు. రేవంత్ రెడ్డి చేస్తున్న నమ్మక ద్రోహాన్ని మాదిగ జాతి సహించదు అని హెచ్చరించారు. విద్యా శాఖ తన పరిధిలోని ఉన్నది. ఎస్సీ వర్గీకరణ మీద మాట ఇచ్చి తన శాఖ పరిధిలోనే 11 వేలకు పైగా టీచర్ పోస్టులను ఎస్సీ వర్గీకరణ లేకుండా భర్తీ చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి పదవి కాపాడుకోవడం కోసం మాదిగలకు అన్యాయం చేయడం తగదు...ఒక జాతికి న్యాయం చేయడం కన్నా ముఖ్యమంత్రి పదవీ కాపాడుకోవడమే ఎక్కువా... మల్లిఖార్జున్ ఖర్గే ,కొప్పుల రాజు ను చూసి సీఎం రేవంత్ రెడ్డి భయపడు తున్నాడు. రాష్ట్రంలోని మాల ప్రజాప్రతినిధులకు తలొగ్గి ఉద్యోగాలు దోచి పెట్టే కార్యక్రమానికి పూనుకున్నాడు... మాదిగలకు ద్రోహం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎదుర్కోవటానికి ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈనెల 6న తుక్కుగూడ కళ్ల శ్రీ గార్డెన్‌లో జరిగే మాదిగల ధర్మ యుద్ధ సదస్సును మాదిగ మాదిగ ఉపకులాలు,ఉద్యోగులు,విద్యార్థులు,నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాని భాను ప్రసాద్, శంషాబాద్ మండల్ అధ్యక్షులు పాల మహేష్ మాదిగ, సిద్దు, అఖిల్,పవన్,సాయి,ధరణి, వర్ష,రేవతి, శ్రీచరణ్, కళ్యాణ్, సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ నుంచి మిర్యాలగూడకు వెళ్తున్న బస్సు పల్టీ



**చౌటుప్పల్ టౌన్ నవంబర్ 04 (ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం బొర్రోళ్లగూడెం సమీపంలో 65వ నెంబర్ జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం తృటిలో పెను ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ సహా నలుగురు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చౌటుప్పల్ పోలీస్ ఇన్స్పెక్టర్ మన్మధరావు కథనం ప్రకారం..నల్గొండ జిల్లా మిర్యాలగూడ డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్ ప్రెస్ బస్సు సుమారు 50 మంది ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి మిర్యాలగూడకు వెళ్తోంది. మండల పరిధిలోని బొర్రోళ్ల గూడెం సమీపంలోకి రాగానే బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో నల్గొండ జిల్లా నార్కట్ పల్లికి చెందిన బొప్పని విజయ,చిట్యాల మండల కేంద్రానికి చెందిన మారుపాక అనిత,నల్గొండ పరిధి నాంపల్లికి చెందిన పూసపాక ఆండాలుతో పాటు బస్సు డ్రైవర్ మైతిగం జానయ్య లు గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు హుటా హుటిన ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఆర్టీసీ బస్సు డ్రైవర్ అజాగ్రత్త..అతివేగం కారణంగానే ప్రమాదం చోటు చేసుకుందని చౌటుప్పల్ పోలీస్ ఇన్స్పెక్టర్ మన్మధ రావు తెలిపారు.బస్సు ప్రయాణికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్స్పెక్టర్ మన్మధరావు తెలిపారు.

## ఏపీ టెట్ ఫలితాలు విడుదల

- త్వరలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల
- మంత్రి నారా లోకేష్



**అమరావతి, నవంబర్ 4: ప్రజాక్షేత్రం:**

ఏపీ టెట్ - 2024 ఫలితాలు విడుదలయ్యాయి. సోమవారం ఉదయం మంత్రి నారా లోకేష్ ఫలితాలను విడుదల చేశారు. టెట్ ఫలితాల్లో 50.79 శాతం మంది అర్హత సాధించారు. మొత్తం 1,87,256 మంది అర్హత పొందారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. త్వరలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో యువత, నిరుద్యోగులకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది అక్టోబర్‌లో నిర్వహించిన టెట్ - 2024 ఫలితాలను ఈరోజు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 3,68,661 మంది హాజరుకాగా అందులో 1,87,256 ( 50.79 శాతం) మంది అర్హత సాధించారన్నారు. ఫలితాలను వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని చెప్పారు. నిరుద్యోగ టీచర్లకు ఇచ్చిన మాట ప్రకారం త్వరలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. టెట్‌లో అర్హత సాధించిన వారందరికీ మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా.. గత నెలలో (అక్టోబర్) ఏపీ టెట్ -2024 పరీక్షను నిర్వహించారు. టెట్‌కు మొత్తం 4,27,300 మంది దరఖాస్తు చేసుకోగా 3,68,661 మంది పరీక్ష రాశారు. 58,639 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. అయితే త్వరలోనే 16,347 పోస్టులతో మెగాడీఎస్సీ నోటిఫికేషన్‌ను సర్కార్ జారీ చేయనున్న నేపథ్యంలో టెట్ ఫలితాలపై అభ్యర్థుల్లో ఆసక్తి పెరిగింది. టెట్‌లో అర్హత సాధించినవారికి డీఎస్సీలో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. అంతకుముందు టెట్ అర్హత సర్టిఫికెట్ ఏడేళ్లు మాత్రమే చెల్లుబాటయ్యేది. 2022 నుంచి దీన్ని జీవిత కాలానికి మార్చారు. 2022 టెట్‌లో చాలామంది అర్హత సాధించినా మార్కుల్లో మెరుగుదల కోసం చాలామంది ఇప్పుడు మరోసారి పరీక్ష రాశారు. డీఎస్సీలో టెట్ మార్కులకు 20 శాతం వెయిటేజీ ఉంటుంది.

## విజయ్ వ్యాఖ్యలపై సీఎం స్టాలిన్ మండిపాటు

**చెన్నై, నవంబర్ 4ప్రజాక్షేత్రం:**

తమిళ స్టార్ నటుడు విజయ్ దళపతి రాజకీయ పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. తమిళగ వెట్రి కళగం పేరుతో పార్టీని ప్రకటించారు. గత నెల తొలిసారి భారీ బహిరంగ సభను కూడా నిర్వహించారు. ఈ క్రమంలోనే ఆదివారం తమ పార్టీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో 26 తీర్మా నాలను ఆమోదించారు. ముఖ్యంగా 'వన్ నేషన్, వన్ ఎలక్షన్', నీట్‌ను తీవ్రంగా వ్యతిరేకించారు. ఇదే సమయంలో తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకే ప్రభుత్వంపై విజయ్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. స్టాలిన్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. డీఎంకే ఎన్నికల మేనిఫెస్టో అధికారాన్ని చేజిక్కించుకోవాలనే ఉద్దేశంతో అబద్ధాలతో నిండి పోయిందని వ్యాఖ్యానించారు. అయితే, విజయ్ వ్యాఖ్యలపై సీఎం స్టాలిన్ తాజాగా స్పందించారు. ఎన్నికల హామీలను చాలా వరకూ నెరవేర్చినట్లు స్పష్టం చేశారు. 'మా ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చలేదని కొందరు వాదిస్తున్నారు. మేము చేసిన వాగ్దానాలన్నీ నెరవేర్చాం. మిగిలిన ఒకటి లేదా రెండు త్వరలోనే అమలు చేస్తాం' అని స్పష్టం చేశారు. ఇదే సమయంలో విజయ్‌పై స్టాలిన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 'కొత్త పార్టీలను ప్రారంభించే వారంతా డీఎంకే పతనం గురించి మాట్లాడుతున్నారు. దాని గురించి మాకు ఆందోళన లేదు. విమర్శలను మేం పట్టించుకోం. వారిని మాధానాలిచ్చి మా సమాయన్ని వృథా చేసుకోవాలనుకోవడం లేదు. ప్రజల ప్రయోజనం కోసం పనిచేయడమే మా పని. నాలుగేళ్ల ప్రభుత్వ విజయాల గురించి ఆలోచించాలని వారికి నేను వినమ్రంగా చెప్పాలనుకుంటున్నాను' అని స్టాలిన్ పేర్కొన్నారు.

## నారాయణ కళాశాల విద్యార్థిని ఆత్మహత్య

**జిన్నారం నవంబర్ 04(ప్రజాక్షేత్రం):**

జిన్నారం మండలంలోని బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో గల నారాయణ కళాశాల హాస్టల్ లో ఇంటర్మీడియట్ ఫస్టియర్ చదువుతున్న ఓ విద్యార్థిని ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం రాత్రి జరిగింది. బొల్లారం సీఐ గంగాధర్, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జిన్నారం మండలంలోని బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఖాజీపల్లి గ్రామ శివారులో నారాయణ కళాశాల హాస్టల్ ఉంది. ఈ హాస్టల్లో 1500 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుంటారు. వరంగల్ జిల్లా అయినవోలు గ్రామానికి చెందిన బాలబోయిన వైష్ణవి (16) ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ లో ఎంపీసీ విద్యను అభ్యసిస్తుంది.కళాశాలలోని 219 గదిలో వైష్ణవి ఉంటుంది. కాగా 315 గది నంబర్‌లో రాత్రి 7 గంటల సమయంలో వైష్ణవి ఫ్యాన్‌కు చున్ని తో ఊరి వేసుకొని అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని గమనించిన తోటి విద్యార్థులు యాజమాన్యానికి సమాచారం అందించారు. దీంతో యాజమాన్యం హుటాహుటిన వైష్ణవిని సమీపంలోని ఎస్ ఎల్ జీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వైష్ణవి మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుగుతున్నట్టు సీఐ గంగాధర్ వెల్లడించారు.గుట్టు చప్పుడు కాకుండా హాస్టల్లో వైష్ణవి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని యాజమాన్యం గోప్యంగా ఉంచింది. తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురి అయ్యేలా యాజమాన్యం వ్యవహరించడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.




**భయాందోళనలో తోటి విద్యార్థులు**

వైష్ణవి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటనతో తోటి విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. హాస్టల్ లో గల కిటికీల నుంచి విద్యార్థులు బయటకు చూస్తూ తమ తల్లిదండ్రుల కోసం ఎదురుచూస్తున్నట్టు కనిపించింది. ఇలాంటి ఘటనలు తరచూ నారాయణ కళాశాల హాస్టల్ లో జరుగుతుండడంతో తోటి విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఇప్పటికైనా యాజమాన్యం విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడిని కలిగించవద్దని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## ఆదాయా మార్గాలపై ప్రభుత్వం దృష్టి

- భట్టి నేతృత్వంలో ఉపసంఘం భేటీ



**హైదరాబాద్,నవంబర్4ప్రజాక్షేత్రం:**

నిధుల సమీకరణపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన దీన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఖజానాకు అదనపు నిధుల సమీకరణపై సమావేశంలో చర్చించారు. సంబంధిత శాఖల అధికారులతో ఉపసంఘం చర్చలు సాగాయి. రాష్ట్రంలో ఆదాయం తగ్గడంతో పాటు అప్పులు పెరుగుతున్నాయి. అలాగే పథకాల అమలుకు కూడా నిధులు వెచ్చించాల్సి వస్తోంది. దీంతో రాబడి పెంచుకునే మార్గాలపై అన్వేషిస్తున్నారు. ఇప్పటికే రియల్ ఎస్టేట్ ఆదాయం భారీగా పడిపోయింది. కొనుగోళ్లు, అమ్మకాలు తగ్గాయి. ఈ క్రమంలో ఆదాయ మార్గాలను అన్వేషిస్తున్నారు.

## దీపం జ్ఞానానికి ప్రతీక


- శివకేశవులకు ప్రీతిపాత్రం కార్తీకం
- కార్తీక దీపాలకు అందుకే ప్రత్యేకత

**శ్రీశైలం,నవంబర్4ప్రజాక్షేత్రం:**

శివకేశవులకు అత్యంత ప్రీతిపాత్రమైన మాసం కార్తీకం. ఈ నెలలో చంద్రుని వెన్నెలకాంతులు పౌర్ణమి రోజున నిండుగా భూమిపైకి ప్రసరిస్తాయి. స్వచ్ఛమైన పాలనురుగు లాంటి వెన్నెలను మనం పౌర్ణమి రోజున వీక్షించగలం. శ్రీశైలంలో భక్తుల రద్దీ పెరిగింది. ఇక్కడ దీపాలంకరణ చేపట్టారు. క్షీరసాగర మధన సమయంలో వెలువడిన హాలహలాన్ని పరమేశ్వరుడు సేవించి తన గొంతులో వుంచుకున్నాడు. అయితే ఆ విష ప్రభావానికి శివుడు అస్వస్థతకు గురయ్యాడు. అగ్ని స్వభావం గలిగిన ఆ విషం నుంచి మహేశ్వరుడిని కాపాడమని అమ్మవారు అగ్నిదేవున్ని ప్రార్థించింది. అనేక సపర్యల అనంతరం శివుడు కోలుకున్నాడు. అగ్నిస్వభావం వున్న కృతికానక్షత్రానికి పార్వతీదేవి కృతజ్ఞతగా కార్తీక పౌర్ణమి నాడు జ్వాలాతోరణం ఏర్పాటుచేసింది. అందుకనే ఈ పౌర్ణమిని అత్యంత విశిష్టమైనదిగా పేర్కొంటారు. ఈ రోజున మహిళలు పగలంతా ఉపవాస దీక్షలో వుండి రాత్రి దీపారాధన చేయాలి. ఇంటి ముందు వాకిట్లలో, పుణ్యతీర్థాల్లో, దేవాలయప్రాంగణాల్లో , నదీతీరాల్లో, పుష్కరిణుల్లో దీపాలను వెలిగిస్తారు.ఇదో అద్భుతఘట్టం. కార్తీక మాసం ఆధ్యాత్మికపరంగా విశిష్టమైన నెల. ఈ మాసంలో అత్యంత పవిత్రమైనది కార్తీకపౌర్ణమి కావడంతో భగవంతుని కృపకు ఎంతో ఉపకరిస్తుంది. ఈ రోజున తమ శక్తికొలది దానాలు చేస్తే ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. మార్కండేయ పురాణగ్రంథం దానం చేస్తే మంచిదని ధర్మగ్రంథాలు పేర్కొంటున్నాయి. సంవత్సరంలో ప్రతి మాసానికీ ఒక్కొక్క విశిష్టత ఉంటుంది. అన్ని మాసాల్లోనూ కార్తికమాసానిది ఓ విశిష్టశైలి. ఇది హరిహరులకు ప్రీతికరమైన మాసమంటారు. హరి స్థితికారకుడైతే, హరుడు శుభంకరుడు. వీరిద్దరి ఆరాధన అంటే- మనం చరించే 'స్థితిగతి' సవ్యంగానూ, ఆచరించే ప్రతీ కర్మ శుభాలనిచ్చేదిగానూ ఉండాలన్న ఆశయసిద్ధికై అంతర్ముఖయానం గావించుకోవాలన్న దానికి ప్రతీక ఈ మాసమని చెబుతారు. కార్తికస్నానం, దీపం, వ్రతం, పౌర్ణమి, సమారాధన, ఉపవాసాలు, జాగరణలు భక్తితత్వాన్ని పెంచేవిధంగా ఉంటాయి. కార్తిక సోమవారాలు మరింత ప్రత్యేకం. మాసంలో ప్రాతఃకాలపు స్నానాలకు ఎంతో ప్రాముఖ్యమిస్తారు. ప్రాతఃకాలంలో చేసే స్నానం రుషీస్నానం, ఉత్తమమైంది. ఈ మాసం ప్రవేశించేనాటికి వర్షరుతువు సమాప్తమవుతుంది. వర్షజలధారలు సమస్త మూలికల సారాన్ని, భూపొరల్లోని ధాతువుల సారాన్ని కలగలుపుకొని నదుల్లోకి అంతర్వాహినిగా వచ్చిచేరతాయి. షధజలంలా జలప్రవాహాలు పరిఢవిల్లుతాయి. ప్రవాహవేగానికి ఎదురుగా నిలబడి స్నానమాచరిస్తే- జలప్రవాహాల్లో ఔషధీయగుణాలు, విద్యుత్ తరంగాలు దేహానికి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయి. స్నానానంతరం రావిచెట్టు, తులసి, ఉసిరిక చెట్ల వద్ద దీపారాధన, దైవారాధన చేయాలని శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ వృక్షసంపద ఆరోగ్య భాగ్యాన్ని కలుగజేస్తుంది. యజ్ఞ ద్రవ్యంగానూ ఉపయోగ పడుతుంది. జ్ఞానానికి చిహ్నం దీపం. సర్వసంపదలు జ్ఞానంవల్ల లభిస్తాయి. ఈ మాసంలో దీపదానం ప్రాశస్త్యం చాలా ఉంటుంది. ఈ మాసం ఆసాంతం దీపారాధన చేసి చివరిరోజున వెలుగుతున్న వెండి ప్రమిదను దానంచేస్తే- అనంతపుణ్యఫలం, సకల ఐశ్వర్యాలు కలుగుతాయంటారు. జ్ఞానం సకల సంపదలకు నెలవు కాబట్టి, ఆ జ్ఞానాన్ని పదుగురికీ పంచి ప్రకాశవంతమైన జీవనవిధానాన్ని సమాజంలో నెలకొల్పాలన్న సందేశం ఇందులో ఉంది. మాన వాతావరం దృష్ట్యా ఏక భుక్తమే ఆరోగ్యానికి శ్రీరామరక్ష. ఈ కాలంలో జఠరాగ్ని మందంగా ఉంటుంది. దాన్ని చురుగ్గా ఉంచేందుకు ఏకభుక్తమే ఔషధం. అన్నార్తుల క్షోభ ఎటువంటిదో తెలుసు కోవాలన్నది ఉపవాసాల పరమార్థం. ఉపవాసం అంటే ఆహారంలేకుండా దినం గడపడమని కాదు- భగవస్సాన్నిధ్యంలో ఆ రోజును గడపడం. కార్తిక సోమవారాలది పెద్ద సందడి. సోమవారం శివుడికి ప్రీతికరమైన రోజు. మారేడు దళాలతో పూజిస్తే శివసాయుజ్యం లభిస్తుందని పురాణప్రవచనం.

## 24 గంటల కరెంట్ ఘనత కెసిఆర్‌దే

- తప్పుదోవ పట్టించేలా కాంగ్రెస్ ప్రచారం
- మండిపడ్డ మాజీమంత్రి హరీష్ రావు



**హైదరాబాద్,నవంబర్4ప్రజాక్షేత్రం:**

గంటల కరెంటు విషయంలో దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్న జాతీయ కాంగ్రెస్ వైఖరిపై సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. నవ్విపోదురు గాక, నాకేం సిగ్గు అన్నట్టుంది కాంగ్రెస్ పార్టీ తీరు ఉన్నదని ఎద్దేవా చేశారు. దేశంలో రైతులకు 24 గంటల ఉచిత కరెంటును అందించిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణను నిలిపింది బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ అని చెప్పారు. 2018, జనవరి 1 నుంచే రాష్ట్రంలో అన్నదాతలకు 24 గంటల ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. కానీ, ఆ ఘనత కూడా తమదేనంటూ ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని విమర్శిచారు. గతంలో రైతులకు 24 గంటల ఉచిత కరెంటు దండగ అని, మూడు గంటల కరెంటు సరిపోతుందని రైతు వ్యతిరేక వైఖరిని ప్రకటించిన చరిత్ర రేవంత్ రెడ్డిది, కాంగ్రెస్ పార్టీదని మండిపడ్డారు. ఇప్పుడేమో ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో ఓట్ల కోసం కేసీఆర్ అందించిన 24 గంటల ఉచిత కరెంటు ఘనతను తమ ఖాతాలో వేసుకుంటూ దేశవ్యాప్తంగా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు విమర్శించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సాధించిన అభివృద్ధిని చూపించుకునే ముఖం లేక, తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ సాధించిన అభివృద్ధిని చూపించి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరికి, మోసపూరిత విధానానికి మరో నిదర్శనమని చెప్పారు.




ప్రజా క్షేత్రం

# ఎల్లో చీర కట్టులో ఈషా డబుల్ అందం



టాలీవుడ్‌లో తెలుగు అమ్మాయిలకు హీరోయిన్‌గా అవకాశాలు రావడం కష్టంగా ఉన్న పరిస్థితుల్లో ఈషా రెబ్బా ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. సోషల్ మీడియా ద్వారా, యూట్యూబ్ ద్వారా పాపులారిటీని సొంతం చేసుకున్న ఈషా టాలీవుడ్‌లో అంతకు ముందు ఆ తర్వాత సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి పదేళ్లు అయినా ఇంకా మీడియం రేంజ్ హీరోలతో సినిమాల్లో నటిస్తూ, హీరోయిన్‌గా ఆఫర్ల కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉంది. హీరోయిన్‌గా స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు రావడం కోసం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం మాత్రం దక్కడం లేదు. ముంబై ముద్దుగుమ్మలకు ఏమాత్రం తగ్గకుండా అందంగా ఉండే ఈషా రెబ్బా సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఆకట్టుకునే ఫిజిక్ తో పాటు, కెమెరా ముందు ఆమె నిల్చుంటే అతకు మించి అన్నట్లుగా అందంగా కనిపిస్తూ ఉంటుంది. అందుకే ఈషా రెబ్బా కి అవకాశాలు రాకపోవడం అన్యాయం అంటూ ఆమె ఫ్యాన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తూ ఉంటారు. తాజాగా మరోసారి తన అందంను చూపిస్తూ సోషల్ మీడియా ద్వారా కుర్రకారు మతి పోగొట్టినంత పని చేస్తోంది. ఈసారి ఎల్లో చీర కట్టులో సింపుల్ అండ్ స్వీట్‌గా లూజ్ హెయిర్ తో మతి పోగొట్టే విధంగా మత్తు కల్లతో చూస్తూ ఈషా రెబ్బ కన్నుల విందు చేస్తోంది. క్లీ వేజ్ షో తో ఆకట్టుకున్న ఈషా రెబ్బ మరోసారి తన అందం ఉత్తరాది ముద్దుగుమ్మలకు ఏమాత్రం తక్కువ కాదని నిరూపించేలా ఈ ఫోటోలు ఉన్నాయి. ఇంత అందంగా ఉన్న ఈషా కి పాపం ఎందుకు ఆఫర్లు రావడం లేదని కొందరు కామెంట్స్ చేస్తే, తెలుగు అమ్మాయి కాకుండా ఉంటే ఈషాకి టాలీవుడ్ స్టార్ ఫిల్మ్ మేకర్స్ బ్రహ్మరథం పట్టే వారు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈషా రెబ్బ తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో జన్మించినా పెరిగింది మాత్రం హైదరాబాద్ లోనే. చిన్నప్పటి నుంచే నటనపై ఆసక్తి కనబర్చుతూ వచ్చిన ఈషా రెబ్బ మోడలింగ్ చేసింది. కాలేజ్ సమయంలోనే మోడల్‌గా మంచి గుర్తింపు దక్కించుకున్న ఈషా రెబ్బకి దర్శకుడు మోహన కృష్ణ ఇంద్రగంటి నుంచి మొదటి సారి ఆడిషన్ కోసం కాల్ వచ్చిందట. ఆయన దర్శకత్వంలో నటించడం ద్వారా నటిగా ఈషా రెబ్బకి ఎంట్రీ దక్కింది. కానీ స్టార్‌గా మాత్రం ఈషా రెబ్బకి పదేళ్లు అయినా గుర్తింపు రాలేదు. తెలుగు అమ్మాయిలు ఈస్థాయికి రావడమే గొప్ప విషయం అన్నట్లుగా పరిస్థితి ఉంది.

# ముంబైలో 'మట్కా'... వరుణ్ పాన్ ఇండియా ఆశలు



మెగా హీరో వరుణ్ తేజ్ 'మట్కా' సినిమాతో ఈనెల 14న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. విభిన్న చిత్రాల దర్శకుడిగా పేరున్న కరుణ కుమార్ దర్శకత్వంలో రూపొందిన 'మట్కా' సినిమాలో వరుణ్ తేజ్ మూడు విభిన్నమైన ఏజ్ గ్రూప్‌లో కనిపించబోతున్నాడు. ఇప్పటికే వచ్చిన టీజర్, ట్రైలర్ తో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. కేవలం తెలుగులో మాత్రమే కాకుండా ఈ సినిమాను పాన్ ఇండియా రేంజ్ లో విడుదల చేసే విధంగా ప్లాన్ చేస్తున్నారు. భారీ అంచనాల నడుమ హిందీలోనూ విడుదల చేయబోతున్నట్లుగా మేకర్స్ ఇటీవలే అధికారికంగా ప్రకటించిన విషయం తెల్సిందే. సినిమా హిందీ వర్షన్ కోసం చిత్ర యూనిట్ సభ్యులు ముంబైలో మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. మట్కా సినిమా హిందీ ప్రేక్షకుల అభిరుచికి దగ్గరగా ఉంటుందని, కచ్చితంగా అక్కడ మంచి స్పందన వస్తుందనే నమ్మకంను మేకర్స్ వ్యక్తం చేస్తున్నారు. ముంబైలో మీడియా సంస్థలకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూల్లో హీరో వరుణ్ తేజ్, హీరోయిన్ మీనాక్షి చౌదరిలు సినిమా గురించి చెప్పుకొచ్చారు. కథ, కథనం నార్త్ ఇండియన్ ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయ్యే విధంగా ఉంటుందని దర్శకుడు కరుణ కుమార్ తెలియజేశారు. ఈ మధ్య కాలంలో సౌత్ సినిమాలు నార్త్ లో మంచి వసూళ్లు నమోదు చేస్తున్నాయి. దేవర సినిమాకు అక్కడ భారీ ఎత్తున ప్రమోషన్స్ చేసిన విషయం తెల్సిందే. దాంతో సినిమాకు అక్కడ నుంచి డీసెంట్ వసూళ్లు దక్కాయి. కనుక మట్కా సినిమాకు సైతం మంచి వసూళ్లు దక్కే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. నెట్టింట మట్కా గురించి జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో మంచి వసూళ్లతో పాటు, సినిమాకు రివ్యూవర్స్ నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. మొత్తానికి మట్కా సినిమా హిందీ వర్షన్ పై మేకర్స్ చాలా ఆశలు పెట్టుకున్నారు. వరుణ్ తేజ్ ఈ మధ్య కాలంలో చేసిన పలు సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచాయి. కనుక ఈ సినిమాపై ఆయన చాలా నమ్మకం పెట్టుకుని, కష్టపడి చేశాడని తెలుస్తోంది. వరుణ్ తేజ్ మొదటి పాన్ ఇండియా మూవీ మట్కా కావడంతో అందరి దృష్టి ఈ సినిమాపై ఉంది. వరుణ్ కంటున్న పాన్ ఇండియా కల ఈ సినిమాతో నెరవేరుతుందా అనేది చూడాలి. పెళ్లి తర్వాత వరుణ్ తేజ్ నుంచి రాబోతున్న మట్కా సినిమా ఆయనకు చాలా స్పెషల్ మూవీ అంటూ యూనిట్ సభ్యులు మాట్లాడుతున్నారు. మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి హీరోయిన్స్ గా నటించిన ఈ సినిమా హిందీ వర్షన్ ఎలా ఉంటుంది... ఓవరాల్ గా ఈ సినిమాకు ఎలాంటి స్పందన వస్తుంది అనేది వచ్చే వారంలో సినిమా విడుదల తర్వాత క్లారిటీ వచ్చే అవకాశాలు ఉన్నాయి.

# భైరవం ఫస్ట్ లుక్: రస్టిక్ అవతార్‌లో బెల్లంకొండ!



టాలీవుడ్ యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తెలుగు తెర మీద కనిపించి మూడున్నర సంవత్సరాలు దాటిపోయింది. చివరగా 2021 సంక్రాంతికి 'అల్లుడు అదుర్స్' సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించాడు. ఆ తర్వాత 'ఛత్రపతి' రీమేక్ తో బాలీవుడ్ లో భంగపడ్డ అల్లుడు శ్రీను.. ఇప్పుడు బ్యాక్ టూ బ్యాక్ సినిమాలతో రావడానికి రెడీ అవుతున్నాడు. ఇందులో భాగంగా తాజాగా తన కొత్త చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. విజయ్ కనకమేడల దర్శకత్వంలో బెల్లంకొండ శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ వంటి ముగ్గురు హీరోలు కలిసి ఓ సినిమా చేస్తున్నట్లు చాలా రోజులుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇది తమిళ్ లో ఘన విజయం సాధించిన 'గరుడన్' మూవీకి రీమేక్ అనే టాక్ కూడా నడిచింది. అయితే ముగ్గురు హీరోల కాంబినేషన్ లో ఓ భారీ ప్రాజెక్ట్ కి అఫిషియల్ అనౌన్స్ మెంట్ వచ్చింది. ఈ చిత్రానికి "భైరవం" అనే పవర్ ఫుల్ టైటిల్ ను ఫిక్స్ చేసారు. ఈ సందర్భంగా బెల్లంకొండ శ్రీనివాస్ ఫస్ట్ లుక్ పోస్టర్ ని ఆవిష్కరించారు. "భైరవం" ఫస్ట్ లుక్ పోస్టర్ లో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ టెర్రిఫిక్ లుక్ లో చాలా పవర్ ఫుల్ గా కనిపిస్తున్నారు. గుబురు గడ్డంతో రస్టిక్ అండ్ రగ్గడ్ అవతార్ లోకి మారిపోయాడు. ఒక చేతిలో త్రిశూలం, మరో చేతిలో పెద్ద కత్తి పట్టుకొని కూర్చొని ఇంటెన్స్‌గా చూస్తూ ఉన్నాడు. రక్తంతో తడిసిన ఆయుధాలను చూస్తుంటే అతను శత్రు సంహారం చేస్తున్నట్లు తెలుస్తోంది. బ్యాక్‌గ్రౌండ్‌లో పెద్ద దేవాలయం, కాగడాలు పట్టుకొని నిలబడి ఉన్న జనాన్ని కూడా మనం చూడొచ్చు. 'భైరవం' సినిమాలో సాయి శ్రీనివాస్ ఎలాంటి శక్తివంతమైన పాత్ర పోషించాడనేది ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌తో తెలియజేసారు. ఇది ఆడియన్స్ ను విశేషంగా ఆకట్టుకుంటోంది. టైటిల్ డిజైన్ కూడా బాగుంది. త్వరలోనే మనోజ్ మంచు, నారా రోహిత్ ల ఫస్ట్ లుక్ పోస్టర్లను కూడా విడుదల చేస్తామని చిత్ర బృంద తెలిపింది. చాలా కాలం తర్వాత తెలుగులో ముగ్గురు కథానాయకులు కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడంతో, ఇప్పటికే ఈ సినిమాపై జనాల్లో ఆసక్తి కలిగింది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కెకె రాధామోహన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బెల్లంకొండ శ్రీనివాస్ ను బాలీవుడ్ కు పరిచయం చేసిన పెన్ స్టూడియోస్ డాక్టర్ జయంతిలాల్ గడా ఈ సినిమాని సమర్పిస్తున్నారు. శ్రీ చరణ్ పాకాల సంగీతం సమకూరుస్తున్నారు. హరి కె వేదాంతం సినిమాటోగ్రాఫర్ గా, ఛోటా కె ప్రసాద్ ఎడిటర్ గా వర్క్ చేస్తున్నారు. బ్రహ్మ కడలి ప్రొడక్షన్ డిజైనింగ్ చేస్తుండగా.. సత్యర్షి, తూమ్ వెంకట్ ఈ సినిమాలో డైలాగ్స్ రాస్తున్నారు.'గరుడన్' సినిమాలో సూరి, శశికుమార్, ఉన్ని ముకుందన్ లు హీరోలుగా నటించారు. నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ వెట్రిమారన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. స్నేహం, నమ్మకం, విశ్వాసం, నమ్మక ద్రోహం, అత్యాశ వంటి అంశాల చుట్టూ అల్లుకున్న కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇప్పుడు డైరెక్టర్ విజయ్ కనకమేడల తెలుగు నేటివిటీకి తగ్గట్టుగా మార్పులు చేసి, తనదైన స్క్రీన్ ప్లేతో రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. 'నాంది', 'ఉగ్రం' వంటి సినిమాలతో నిరూపించుకున్న దర్శకుడు.. 'భైరవం' మూవీతో ఎలాంటి విజయాన్ని అందుకుంటారో చూడాలి.

# బడా స్టార్స్ పై తాప్సీ మరో పంచ్..!



తెలుగులో ఝుమ్మందినాదం సినిమాతో పరిచయమై ఇక్కడ కొన్ని సినిమాలు చేసి వర్క్ అవుట్ అవ్వట్లేదని బాలీవుడ్ షిఫ్ట్ అయ్యింది తాప్సీ పన్ను. బాలీవుడ్ లో ఇంపాక్ట్ ఉన్న సినిమాలు చేస్తూ సత్తా చాటింది. తను చేస్తున్న సినిమాలే కాదు బాలీవుడ్ కి వెళ్లాక తాప్సీ చేస్తున్న కామెంట్స్ కూడా బోల్డ్ గా ఉన్నాయి. బాలీవుడ్ స్టార్స్ పై కంగనా తర్వాత ఆ రేంజ్ లో టార్గెట్ చేస్తూ కామెంట్ చేసే తాప్సీ లేటెస్ట్ గా మరోసారి వారిపై పంచ్ వేసింది. బడా స్టార్స్ సినిమాల్లో కథానాయిక ఎంపిక వారి ఇష్టమే అని అన్నది తాప్సీ అంతేకాదు స్టార్స్ ని ఓవర్ షాడో చేసే హీరోయిన్స్ కు వారు ఛాన్స్ ఇవ్వరని బాంబ్ పేల్చింది. ఏ స్టార్ అయినా సినిమాలో తమకన్నా ఎక్కువ నటించే లేదా తమని దాటి అభినయించే నటీమణిని వద్దంటాడా సినిమాకు ఏది అవసరమో అది తీసుకుంటారు కద. మరి తాప్సీ ఈ కామెంట్స్ తనకు ఎదురైన అనుభవాల వల్ల చెప్పిందేమో కానీ సినిమాకు ఉపయోగపడే అలాంటి విషయాల్లో స్టార్స్ అలా చేస్తారంటే నమ్మేలా లేదు. ఇక తాప్సీ చేసిన జుడ్వా, డుంకీ సినిమాలో కూడా ఎక్కువ రెమ్యునరేషన్ తీసుకోలేదని. ఎందుకంటే స్టార్ సినిమాల్లో నటిస్తే ఎక్కువ రెమ్యునరేషన్ ఇచ్చారు కాబట్టి నటించింది అన్న పేరు తనకు వద్దని రెమ్యునరేషన్ తను ఎప్పుడు తీసుకునేంత తీసుకున్నానని అన్నది తాప్సీ. ఎక్కువ రెమ్యునరేషన్ ఇచ్చి వాళ్లు మళ్లీ తనని మాట అనేలా చేసుకోకూడదని తాప్సీ అలా చేసిందని అంటుంది. ఏమైనా తన మాటల్లో కరుకుదనం చూస్తుంటే తాప్సీకి బాలీవుడ్ స్టార్స్ నుంచి బాద అనుభవించిందని అనిపిస్తుంది. ఐతే తాను చెప్పాలనుకున్న మాటని ఎలాంటి మొహమాటం లేకుండా చెప్పే తాప్సీ ప్రస్తుతం సినిమాల విషయాల్లో కూడా ఆచి తూచి అడుగులేస్తుంది. బాలీవుడ్ పరిశ్రమ గురించి అక్కడ బడా హీరోయిన్స్ కూడా మాట్లాడటానికి వ్యతిరేకిస్తారు కానీ కంగన రనౌత్, తాప్సీ లాంటి వారు మాత్రం అక్కడ జరుగుతున్న విషయాలను కచ్చితంగా చెప్పాలని చూస్తారు. అందుకే ఇలాంటి వారికి అక్కడ మంచి ఫ్యాన్ బేస్ ఉంటుంది. సౌత్ నుంచి బాలీవుడ్ వెళ్లి సక్సెస్ అయిన వారిలో తాప్సీ ఒకరు. అందుకే ఆమె అక్కడే సినిమాలు చేస్తూ కెరీర్ కొనసాగిస్తున్నారు. కమర్షియల్ సినిమాల్లో నటించడం కన్నా తమకు నచ్చిన కథల్లో నటించడం ముఖ్యమని భావించే వారిలో తాప్సీ ఒకరు. అందుకే బాలీవుడ్ లో ఆమెకు స్పెషల్ క్రేజ్ ఏర్పడింది.

# ట్రైలర్ టాక్: ఆసక్తికరంగా నిఖిల్ 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'..!




నిఖిల్ సిద్దార్థ హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కించిన సినిమా "అప్పుడో ఇప్పుడో ఎప్పుడో". ఇందులో రుక్మిణి వసంత్, దివ్యాంశ కౌశిక్ హీరోహీరోయిన్లుగా నటించారు. అప్పుడెప్పుడో షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం.. ఇప్పుడు ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అయింది. నవంబర్ 8న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో రిలీజ్ కాబోతోంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ లో భాగంగా ఇప్పటికే టీజర్, సాంగ్స్ విడుదల చేసిన మేకర్స్.. తాజాగా మూవీ ట్రైలర్ ను ఆవిష్కరించారు. ఫార్ముల వన్ రేసర్ అవ్వాలని కలలు గనే రిషి పాత్రలో నిఖిల్ ను పరిచయం చేయడంతో ఈ ట్రైలర్ ప్రారంభమైంది. అతని కల నిజమయ్యే వరకూ బ్రతకడానికి డబ్బులు కావాలి కాబట్టి ప్లేబాయ్ గా మారినట్లు చూపించారు. రిషి ముందుగా ఐ లవ్ యూ అంటూ తార (రుక్మిణి వసంత్) అనే అమ్మాయిని ప్రేమలోకి దింపి, ఆమె మెడలో తాళి కట్టి పెళ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత తులసి (దివ్యాంశ కౌశిక్) ని కూడా ప్రేమిస్తున్నానని చెప్పి ఆమె వెంట తిరుగుతున్నాడు. రిషి డబ్బు కోసమే ఇద్దరు అమ్మాయిలతో లవ్ ట్రాక్ నడిపినట్లు తెలుస్తోంది. అయితే 'ఆ డబ్బులు సరిపోక పార్ట్ టైమ్ కూడా ప్లాన్ చేసుకున్నాడు' అని కమెడియన్ సత్య వాయిస్ తో చెప్తుండగా.. నిఖిల్ తన ఫ్రెండ్ వైవా హర్షతో కలిసి ఒక శవాన్ని తీసుకెళ్తూ ఏదో మర్డర్ ప్లాన్‌లో భాగమైనట్లు చూపించారు. అలాంటి పరిస్థితుల్లో విలన్ గ్యాంగ్ వాళ్లిద్దరినీ బంధించి, ఏదో డివైజ్ కోసం ప్రశ్నిస్తున్నారు. కానీ అసలు ఆ డివైజ్ గురించే వాళ్ళకి ఏమీ తెలియదని అర్థమవుతోంది. ఓవైపు పోలీసులు, మరోవైపు రౌడీ గ్యాంగ్ వెంటపడటంతో అసలైన ఛేజింగ్ మొదలైనట్లు తెలుస్తోంది. 'ప్రతీవాడు నా లైఫ్‌తో గేమ్ ఆడేసుకుంటూ ఉంటే, నేను చూస్తూ ఊరుకుంటానా వాళ్ల గేమ్ వాళ్లకంటే నేను బాగా ఆడడం మొదలుపెడితే ఎలా ఉంటుందో చూపిద్దాం అనుకున్నాను" అంటూ నిఖిల్ తన గేమ్ స్టార్ట్ చేసినట్లు ట్రైలర్ లో చూపించారు. అయితే చివర్లో రుక్మిణి వసంత్, దివ్యాంశ కౌశిక్ ఇద్దరూ ఒకచోట చేరినప్పుడు నిఖిల్ చీటింగ్ చేసాడనే విషయం బయటపడినట్లు అర్థమవుతోంది. ఇద్దరిలో అతను నిజంగా ఎవరిని ప్రేమించాడు ఎవరిని మోసం చేసాడు పోలీసులు, రౌడీల నుంచి ఎలా భయటపడ్డాడు అసలు ఆ డివైజ్ ఏంటి అనేది తెలియాలంటే 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' సినిమా చూడాల్సిందే. ఇటీవల కాలంలో వైవిధ్యమైన సినిమాలతో ఆడియన్స్ ను అలరిస్తున్న నిఖిల్.. ఈసారి డిఫెరెంట్ యాక్షన్ థ్రిల్లర్‌తో రాబోతున్నాడు. 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' అనేది సుధీర్ వర్మ మార్క్ స్క్రీన్ ప్లే బేస్డ్ మూవీ అని తెలుస్తోంది. ఇందులో నిఖిల్ ఎప్పటిలాగే మంచి ఈజ్ తో నటించాడు. హీరోయిన్లు ఇద్దరూ అందంగా కనిపించారు. వైవా హర్ష, సత్య, సుదర్శన్ నవ్వించే పాత్రలు పోషించారు. అజయ్, జాన్ విజయ్ ఇతర పాత్రల్లో కనిపించారు. ఈ సినిమా షూటింగ్ అంతా ఫారిన్ లోనే జరిగింది. ఓవరాల్ 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' ట్రైలర్ ఆసక్తికరంగా ఉంది. సింగర్ కార్తీక్ ఈ చిత్రానికి సంగీతం సమకూర్చారు. సన్నీ ఎంఆర్ సినిమా నేపథ్యానికి తగ్గట్టుగా బీజీఎమ్ అందించారు. రిచర్డ్ ప్రసాద్ సినిమాటోగ్రఫీ నిర్వహించగా.. నవీన్ నూలి ఎడిటింగ్ వర్క్ చేసారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్ పై బీవీఎస్ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. 'స్వామిరారా', 'కేశవ' తర్వాత నిఖిల్ – సుధీర్ వర్మ కాంబోలో రాబోతున్న ఈ హ్యాట్రిక్ మూవీ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సక్సెస్ సాధిస్తుందో చూడాలి.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at M R P Publications, #6-3-1880,Vanasthalipuram,Ranga Reddy(Dist),Hyderabad, Telangana 500070. Published at H.NO. 2-50, Shankar palli, Ranga Reddy, Hyderabad, Telangana 501203. Editor : K PRAVEEN KUMAR. Phone number 9177920459 , email : prajakshetram1@gmail.com , https://prajakshetram.in , RNI NO. TELTEL/12330